

# ఏప్రిల్ 24న భగవాన్ సత్యసాయిబాబా ఆరాధనోత్సవం

భగవానునికి పరిచయం అవసరం లేదు. ఆయన ఎవరినీ చేయిచాచి అడగలేదు. అడిగినవారెవరికీ లేదనలేదు. తిరుమల తిరుపతి దేవస్థానము సహితము మంచినీటి కోసం భగవానుని అర్థించింది. ఆయనెపుడూ తిరుమల వెళ్లినవారు కాదు. మనకు పేరు తెలియని ప్రపంచ దేశాల్లో సత్యసాయి భక్తులు ఉన్నారు. మందిరాలను నిర్మించుకున్నారు. భజనలు చేస్తూంటారు. అన్న సంతర్పణ చేస్తుంటారు.

సత్యసాయిని మీరు చూసారా అంటూ అడుగుతారు– ఇదిగో ఈ పటంలోనే భగవానుడున్నాడు. మేము ప్రార్థించినవన్నీ అనుగ్రహిస్తుంటాడు. ఆయన విశ్వదేవుడు, గురువు, ఆంధ్రదేశంలో ఆయన జన్మించడం తెలుగువారి అదృష్టం. నిజమేకదా! ●



# ఆవకాయతో పెట్టిన అన్నం ఆరగించి రాజావారు ఓ అగ్రహారం వ్రాసియిచ్చారు
# రుచులు మరిగిన తెలుగువాడు ఆవకాయ లేకుండా ఉండలేడు

ఆవకాయ లేనిదే తెలుగువాడికి ముద్దదిగదు. ప్రొద్దింటి (చల్ది) భోజనం అన్నంలో ఆవకాయని ఎర్రగా కలిపి మొదటి ముద్ద దట్టిస్తేగానీ జిహ్వాకుదుటపడదు. అది తరవాణీ భోజనం అయిందా- రుచి చెప్పనే అక్కర్లేదు. వేడివేడి అన్నం, నెయ్యి, ముద్దపప్పు, సాంబారు, రసం, పనసపొట్టుకూర, కంది పచ్చడి, బంగాళాదుంపల వేపుడు, గడ్డ పెరుగు, అప్పడాలు, వడియాలు, చల్లమిరపకాయలు..ఇలా పళ్ళెంలో ఎన్ని వంటకాలున్నా... ఆవకాయలేకపోతే అదో వెలితి! నాలుక అలకబూనుతుంది! ఉదరం కుదరదంటుంది! మనసు మారాం చేస్తుంది! మూడు తేన్పులు తేన్చినా తిన్నట్టే ఉండదు. పళ్ళెం ఖాళీ అయినా పరగడుపున ఉన్నట్టే అనిపిస్తుంది! ఆంధ్రులకీ ఆవకాయకీ అంత అనుబంధం ఉంది.

ఆవకాయ సమోపకం నభూతో నభవిష్యతి

తెలుగువాడు..

బ్రహ్మదేవుడు..

ఇద్దర్లో ఎవరు గొప్ప?

తూకమేసి చెప్పాలంటే... తక్కెడ తెలుగువాడి వైపే మొగ్గుతుంది. కారణం-?

పుల్లపుల్లని ఓ కాయని గుర్తించాడు. అఖండభూజనులకు ఆవకాయ రుచి చూపించాడు. మరి తెలుగువాళ్లు! దానికి 'మామిడి' అని నామకరణం చేశారు. పదిహేనేళ్లక్కానీ కాపురాదని తెలిసీ పొలంలో మొక్క నాటారా, కంచెపెట్టి కాపుకాశారా, కాయ చేతికొచ్చాక నేలమీద పడకుండా.. ఒడుపుగా కత్తితో కసకసా ముక్కలు చేశారు. అందులో కారమేశారు. ఉప్పేశారు. ఆవపొడి కలిపారు. నువ్వుల నూనె దట్టించారు. కలియబెట్టి జాడీలో నింపారు. దానికి'ఆవకాయ' అనే అద్భుతమైన పేరు పెట్టారు. లొట్టలేస్తూ తినడమెలాగో ప్రపంచానికి నేర్పారు.

ఇప్పుడు చెప్పండి, ఎవరుగొప్ప?

తెలుగువాళ్లేగా? అదీ ఆవకాయంటే..

ఆవకాయంత కమ్మని పద్యం ఒకటి చెప్పాలనిపిస్తుంది!!

**మామిడి ముక్కపై మమకారంజల్లి**
**అందింపనగు జిహ్వా ఆవకాయ**
**ఎండకాలమునందు ఎండిపోయిన గుండె**





మామిడి ముక్కలన్నిటికీ ఆ జాడీయే బ్యాంకు!



**కఠినందనము తెల్పు నావకాయ!**
**కూరలే లేనిచో కోమలి వేయుచో**
**అనురాగపు ముంజూపు ఆవకాయ**
**చీకుచున్నను గాని పీకుచున్ననుగాని**
**ఆనందమే యిచ్చు నావకాయ!**
**ఆపదల నాదుకొను కూర ఆవకాయ**
**అతివ నదుమైన జాడీయె ఆవకాయ!**
**ఆంధ్రమాత సింధూరమ్మో ఆవకాయ** ....అభిమానమంటే అదీ!

నిజానికి తెలుగువాళ్ల ఆవకాయ ప్రేమని నిరూపించడానికి ఏ విట్మన్ టెస్టులూ అక్కర్లేదు. కాయ కోస్తే టెంక ఉన్నట్లు, ఆంధ్రుడి గుండెకోస్తే ఆవకాయే ఉంటుంది!

అందుకే నారాయణరెడ్డిగారు..

**'...ఆవకాయ వియోగమసలె సైపనివాడు**
**ఎవడయ్య ఎవడు వాడు?**
**ఇంకెవడయ్య తెలుగువాడు'** అన్నారు. అంటూ ఆవకాయాభిమానాన్ని అక్షరాల్లో చెప్పారు. అన్నంలో కమ్మకమ్మగా కలుపుకోడానికి, ముద్దపప్పులో కారంకారంగా నంజుకోవడానికి, నోరు చెడ్డప్పుడు వేలికి రాసుకుని నాకడానికీ, మజ్జిగన్నంలో పీచుకూడా పారేయకుండా జుర్రుకోడానికి... ఎలా అయినా అనుభూతి కలిగించే ఆవకాయ ఊరగాయపేరు చెప్పినా నూరూరని వాళ్లు ఇద్దరే.

నోరులేనివాళ్లు... నోరున్నా ఊటలేనివాళ్లు!

అయినా, తెలుగువారికి ఊరగాయతో ఉన్న అనుబంధం ఇప్పటిదికాదు... ప్రబంధాలు యుగం నుంచి ఉంది.

రాయలవారి 'ఆముక్త మాల్యద'లోనూ ఊరగాయల ప్రస్తావనుంది. అప్పటి ప్రభువులకు ఆవకాయంటే పంచప్రాణాలు. ఆ ప్రేమకు సంబంధించి ఓ కథ కూడా ఉంది:

అనగనగా ఓ రాజుగారు వేటకెళ్తూ దారి తప్పారు. పొద్దుపోయింది. కానీ దారిదొరకలేదు. వెళ్లగా వెళ్లగా ఓ ఊరొచ్చింది. అక్కడ పూటకూళ్లమ్మ ఇల్లు కనిపించింది. రాజుగారు మంచి ఆకలిమీదున్నారు. వెళ్లి పెద్దమ్మని నిద్రలేపారు. అప్పటికే అర్థరాత్రి దాటింది. ఇంట్లో కూరగాయలు నిండుకున్నాయి. కానీ వచ్చింది మహారాజాయే! ఆకలి తీర్చకపోతే దండన తప్పదు. ఏం చేయాలి? పూటకూళ్లమ్మకు ఓ ఆలోచన వచ్చింది.

పది నిమిషాల్లో అన్నం వండింది. ఆవకాయ జాడీ, నేతి గిన్నె పక్కన పెట్టి "ప్రభువులకు ఇంతకంటే ఆతిథ్యం ఇవ్వలేను" అని చేతులు జోడించింది. అసలే ఆకలి, ఆపై ఆవకాయ! లొట్టలేస్తూ తిన్నారు రాజుగారు. భుక్తాయాసం తీర్చుకున్నాక...

# సాహితీవేత్త
# అద్దేపల్లి రామమోహనరావు



ఊరిరక మనిషిని పొగిడే మనఃతత్వం ఆయనది కాదు. డా॥ సి. నారాయణరెడ్డి గారిలా పటుత్వం ఉండాలి, గళం పటుతరంగా ఉండాలి– అదే అద్దేపల్లి. అద్దేపల్లి రామ మోహనరావును తిరుపతిలో జరిగిన తెలుగు మహాసభల్లో చూసాను. మరి రెండు సాహితీ సభల్లో చూసిన జ్ఞాపకం. ఎస్.ఆర్. పృథ్వీగారి తెలుగు విద్యార్థిలో వ్యాసం చదివిన తరువాత వారిమీద మరింత గౌరవభావం కలిగింది. పృథ్వీగారి వ్యాసంలోని కొన్ని విషయాలనిందు యదాతథంగా ప్రచురిస్తున్నాను. **– గోటేటి**

**పాటయందున తీపి పారును**
**మాటయందున మలినముండదు**
**మనసు నిండుగ మమత లూరును**
**అతడు చూడగ అద్దేపల్లి!**

సెప్టెంబరు 6, 1936న బందరులో అద్దేపల్లి సుందర్రావు, శ్రీమతి రాజేశ్వరి దంపతులకు జన్మించిన తొలి సంతానం రామమోహనరావుగారు. ఈయనకి ఐదుగురు తమ్ముళ్లు. ముగ్గురు చెల్లెళ్లు. ఆయన తండ్రి సుందర్రావుగారు బాల్ బ్యాడ్మింటన్ ఆటలో ఛాంపియన్ అయితే, ఈయన సాహిత్యంలో ఛాంపియన్. విద్యాభ్యాసానికి వస్తే – డిగ్రీ స్థాయి చదువు బందరులోనే. ఎంఏ– మాత్రం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతిలో చేసారు. 1955 మేడే రోజున శ్రీమతి అన్నపూర్ణగారితో వీరి వివాహం జరిగింది. నలుగురు మగ సంతానం. 1956–71 మధ్య కాలంలో బందరు హిందూ కాలేజి, నందిగామ, ఎన్టీఆర్ కాలేజీలో పనిచేసారు. 1971–1994 మధ్యకాలంలో ఛారిటీస్ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా పనిచేసారు.

అద్దేపల్లివారి తొలి కవిత 1960లో కృష్ణా పత్రికలో ప్రచురించబడింది. సాహిత్య వ్యాసంగం 1963 నుండి ప్రారంభమైందనీ ఆయనే చెప్పారు.

ప్రారంభంలో సాంప్రదాయ కవిత్వంలో వందలాది పద్యాలు వ్రాసారు. ఉమర్‌ఖయ్యాం రుబాయిలను పద్యాలుగా అనువదించి, మధుజ్వాలగా వెలువరించారు. కుందుర్తి, తిలక్‌ల రచనలు చదవటం మూలంగా ఆయన దృష్టి వచన కవిత్వపు మార్గాన్ని ఎంచుకున్నది.

55 సంవత్సరాల సుదీర్ఘ సాహితీ వనంలో విహరించిన అద్దేపల్లి కలం నుండి 30కి పైగా విలువైన గ్రంథాలు వెలువడ్డాయి. మరెన్నో రచనలు ముద్రణ కోసం నిలిచి ఉన్నాయి. వారి షష్టిపూర్తి నాటికి వారి రచనలు "జ్వాల నుండి మెరుపు దాకా' ఒక సంపుటిగా వెలువడినాయి. వ్యాసాలు, వచన కావ్యాలు రెండు సంపుటాలుగా వెలువడ్డాయి. ఆయన వ్రాసినన్ని పుస్తకాలకు పీఠికలు మరొకరు వ్రాయలేదు. సాహిత్యాన్ని గురించి, ఏదిమంచి ఏది చెడు అని వివేచన చేయదలచుకున్నా తెలుసుకోవాలనుకున్నవారికి అద్దేపల్లి వారి విమర్శ వ్యాసాలు, పుస్తకాలు ఉపయోగపడతాయని కె రామమోహనరాయ్ చెబుతారు. అద్దేపల్లిలో కవిని, ఉపన్యాసకుడిని, విమర్శకుడిని చూస్తాం కార్యకర్తని చూస్తాం, ఉన్నత వ్యక్తిత్వాన్ని చూస్తాం; స్నేహసౌందర్యాన్ని చూస్తాం.

అద్దేపల్లి వారి షష్టిపూర్తి సందర్భంగా 'తెలుగు విద్యార్థి' మాసపత్రిక తరపున ఇంటర్వ్యూ చేసే అవకాశం అప్పట్లో నాకు లభించటం అదృష్టం. అద్దేపల్లి భౌతికంగా లేకపోవచ్చు ఆయన రచనలు తెలుగు నేలంతా విస్తరించి ఉన్నాయ్. ఆయన ఆలోచనలు ఎందరో సాహితీపరుల ఊపిరిలో ధ్వనిస్తూనే ఉన్నాయి. ఆయన్ని ప్రేమించిన ప్రతి గుండెలో అద్దేపల్లి బ్రతికే ఉన్నారు. **(ఎస్.ఆర్. పృథ్వీ సౌజన్యం)**

---

**(16వ పేజీ తరువాయి)** పూటకూళ్లమ్మకు ఓ అగ్రహారం దానమిచ్చి ముందుకు కదిలారు. ఊరిపేరు ఆవపాడు! ఆంధ్రదేశంలోనే ఎక్కడో ఉందంటారు.

విజయనగర గజపతుల సంస్థానంలో అయితే ప్రత్యేక పాక నిపుణులు ఉండేవారనీ.. అంతఃపుర అవసరాల కోసం నిఖార్సైన దినుసులతో కొత్తకొత్త పద్ధతుల్లో ఆవకాయ పెట్టేవారనీ, ఆ రుచి రాజకుటుంబానికే తెలుసనీ కథలుగా చెబుతారు. అవన్నీ నిజమైనా కాకపోయినా... ఆవకాయకు రాజపోషణ ఉండేదన్నమాట సత్యం.

కుర్రాడికైతే మామిడి చెట్లు, పచ్చడి కాయల్ని నిక్కరు జేబులో దాచుకుని నాన్నమ్మ కంటబడకుండా... నేస్తాల దగ్గరకి వెళ్ళడం ఓ ఎడ్వెంచర్. అందరికీ పంచుతున్నప్పుడైతే... దానవీర శూరకర్ణ లెవెల్లో ఆ ఫోజొకటి!

మంచికాయలు రాగానే చెవినేయమని పురమాయిస్తారు. సరకు బండి దిగగానే సమాచారం అందుతుంది. ఠక్కున ప్రత్యక్షమైపోతారు. కాయకొనేముందు బోలెడు జాగ్రత్తలు తీసుకోవాలి. కాయగట్టిగా ఉండాలి. ముక్కలోపల రంగుమారుంటే పచ్చడికి పనికిరాదు. ఎంత పుల్లగా ఉంటే అంతమంచిది. కాయలు వచ్చిన సంగతి తెలియగానే అటకమీదున్న ముక్కలుకొట్టే కత్తి హడావిడిగా కిందికి దిగుతుంది. దానికి ఏడాదిలో రెండు మూడు రోజులే పని. ముక్కలు కొట్టడమూ మామూలు పనికాదు. అదో నాజూకైన కళ. కాస్త కండబలము ఉండాలి. అందుకే మగధీరులే ఈ బాధ్యతను నెత్తినేసుకుంటారు. ముక్కల సైజు మరీ పెద్దగా ఉండకూడదు. చిన్నగానూ ఉండకూడదు. దాంతోపాటు వేళ్లు తెగకుండా జాగ్రత్తపడాలి.

అన్నింటికీ మించి శ్రీమతిగారికి నచ్చాలి! మధ్యమధ్యలో...

"బావగారూ! మీ కత్తి మొద్దబారినట్టుంది! కాస్త సాన బట్టించుకోండి' అంటూ మరదళ్ల సరసాలు! అంతకంటే ఘాటుగా బావగారి రిటార్టు! ఆపై నవ్వులు!! అంతపని చేస్తున్నా ఎవరికీ శ్రమ అనిపించదు.

ఆవకాయకు నూనె సెక్యూరిటీ గార్డు! జాడిలోకి గాలి చొరబడకుండా అడ్డుపడుతుంది. బూజు రాకుండా కాపుకాస్తుంది. ఘుమఘుమ బయటికెళ్లకుండా బెదరించే 'రౌడీబాబాయ్' కూడా నూనే! ముక్కమెత్తబడకుండా మిసమిసలాడేట్టు చూసే 'బ్యుటీషియన్' పాత్రా నూనెదే. అందుకే ఆవకాయ మీద ఎప్పుడూ ఒకటి రెండు అంగుళాల నూనె ఉండాలంటారు.

**(గత్తం వేంకటేశ్వరరావు గారికి కృతజ్ఞతలు)**

SRI RAJARAJESWARI
JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

# ఆది కామాక్షి మాంగాడు కామాక్షి!

కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర స్వామివారు మాంగాడు కామాక్షియే ఆది కామాక్షియని నొక్కి చెప్పినప్పట్నుంచీ మాంగాడు కామాక్షి ఆలయం దర్శించే భక్తులు పెరిగారు.

నేను తొలుత నా సతీమణితో కలిసివెళ్లినప్పుడు, ఆలయంలో పదిమంది కూడా లేరు. ఆలయాంతర్భాగం చుట్టి ప్రదక్షిణం చేసినపుడు బెరుకుగా ఉండేది. అటు తరువాత రు.10లు వరసలు, రూ.5లు వరుసలు బారులు తీరి ఉండడం నాకు అనుభవైద్యమైన విషయం.

చెన్నై నుండి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో 'మాంగాడు' ఉంది. 'మాంగాడు' అంటే మామిడితోపు అని అర్థం. అటువంటి 'మాంగాడు'లోని శ్రీకామాక్షిదేవి ఆలయం ప్రాచీన చరిత్రను, ఆధ్యాత్మిక మహత్మ్యాలను సొంతం చేసుకున్న ఆలయం.

శ్రీకామాక్షి దేవి ఈ క్షేత్రంలో కొలువుదీరడం వెనుక ఆసక్తికరమైన పురాణగాథ దాగి ఉంది; దక్షయజ్ఞంలో తనువు ముగించిన సతీదేవి మరుజన్మలో హిమవంతుడు, మేనకలకు పుత్రిక పార్వతీదేవిగా జన్మించింది. పరమశివుడిని తిరిగి పతిగా పొందాలనుకున్న పార్వతీదేవి శివుడిని ప్రార్థించగా శివుడు ప్రత్యక్షమై, దక్షిణాదిలోని మామిడితోపులో తపస్సు చేసినట్లయితే, నిన్ను భార్యగా స్వీకరిస్తానని పలికాడు. దీనితో పార్వతీదేవి దక్షిణదేశానికి చేరుకుని మామిడి తోపులను గుర్తించిన పార్వతీదేవి, మాంగాడు ప్రాంతంలో తపస్సు చేయసాగింది. దీనితో పార్వతీదేవి ప్రేమను పరీక్షించదలచిన పరమశివుడు వృద్ధుడి రూపంలో సన్యాసిగా మాంగాడు ప్రాంతానికి చేరుకున్నాడు. మాయాసన్యాసికి పార్వతీదేవి అనేక సపర్యలు చేసింది. ఆ సన్యాసి పార్వతీదేవి మనసులోని కోరికను తెలుసుకుని అభీష్టం సిద్ధించునట్లు ఆశీర్వదించి మాయమయ్యాడు. అనంతరం పరమశివుడు సప్తర్షులను పిలిపించి పార్వతీదేవిని వివాహం చేసుకోదలచినట్లుగా హిమవంతుడి వద్దకు రాయాబారాన్ని పంపాడు. హిమవంతుడు అందుకు అంగీకరించి వారి వివాహాన్ని జరిపించారు. వారి వివాహం మాంగాడు దగ్గరలోని 'కాంచీపురం'లో జరిగినట్లు కథనం. ఈ విధంగా శివుడిని భర్తగా పొందడం కోసం తపస్సు చేసిన 'మాంగాడు'లో సప్తర్షుల కోసం పార్వతీదేవి కామాక్షిదేవిగా కొలువుదీరినట్లు పురాణ కథనం ఉంది.

కాగా ప్రచారంలో ఉన్న మరో గాథ ప్రకారం ఒకరోజు పరమశివుడు లేని సమయంలో పార్వతీదేవి దిగంబరులై ఉన్న చెలికత్తెలతో గడుపుతూ ఉంది. ఈ సమయంలో శివుడు కైలాసంలో ప్రవేశించడంతో చెలికత్తెల మానం కాపాడడం కోసం పార్వతీదేవి శివుడి కళ్లను తన చేతులతో మూసివేసింది. దీనితో పార్వతీదేవి శరీరం నల్లగా మారిపోయింది. పార్వతీదేవి భయాందోళనలకు గురికాగా.. "కొద్ది క్షణాలు నీవు నా కళ్లు మూసివేయడం వల్ల లోకాలకు సూర్యచంద్రులు లేక అకాల ప్రళయం సంభవించింది. అనేక జీవులు ప్రాణాలు కోల్పోయాయి. ఆ పాపం వల్లనే నీవు ఈ విధంగా నల్లగా మారిపోయావు" అని పలికాడు.

ఈ ఉపద్రవం నుంచి తనను కాపాడవలసిందిగా పార్వతీదేవి శివుడిని వేడుకొనగా...

"నీవు చిన్నపిల్ల రూపంలో బదరికాశ్రమానికి వెళ్లు. కాత్యాయన మహర్షి నిన్ను స్వీకరించి, ఎనిమిది సంవత్సరాలు పోషించి మోక్షం పొందుతాడు. తర్వాత నీవు కాశీనగరం మీదుగా మామిడి అరణ్యానికి వెళ్లి తపస్సు చేయి. నేను వచ్చి మళ్లీ నిన్ను వివాహం చేసుకుంటాను" అని శివుడు వరం ప్రసాదించాడు.

శివుడు చెప్పిన ప్రకారం పార్వతీదేవి చిన్నపిల్లగా మారి బదరికాశ్రమానికి చేరగా, కాత్యాయనుడు తన పుత్రికగా స్వీకరించి పెంచాడు. కొంతకాలానికి ఆమె మామిడి అరణ్యానికి చేరి తపస్సు చేయగా, శివుడు ప్రత్యక్షమై వివాహానికి అంగీకరించి, కాంచీపురంలో వివాహం చేసుకున్నాడు. ఈ విధంగా పార్వతీదేవి తపస్సు చేసిన మామిడి అరణ్యమే 'మాంగాడు'. తపస్సు చేసిన ప్రాంతంలో పార్వతీదేవి శ్రీకామాక్షి పేరుతో కొలువుదీరినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది.

'మాంగాడు'లోని శ్రీకామాక్షి అమ్మవారు మిగతా ఆలయాల్లోలాగా కాకుండా కొంత భిన్నంగా కొలువుదీరి ఉండడం విశేషం. ప్రధానంగా అమ్మవారు పంచాగ్నులపైన ఒంటికాలితో నిలబడి ఉంటుంది. ఈ విధంగా తపోభంగిమతో ఉన్న అమ్మవారు ద్విభుజాలను కలిగిన ఒక చేతిలో రుద్రాక్షమాలను ధరించి, మరో చేతిని వయ్యారంగా కిందికి వదలివేసిన భంగిమలో కొలువుదీరి పూజలందుకుంటూ ఉన్నది. అమ్మవారి ముందువైపు శ్రీచక్రం దర్శనమిస్తుంది.



ఇది 'అర్థమేరు శ్రీచక్రం'. దీనిని ఆదిశంకరాచార్యులవారు ప్రతిష్టింపజేసినట్లు కథనం. శ్రీచక్రం ప్రతిష్టించడం వెనుక ఒక ప్రధాన కారణం ఉన్నట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది. అమ్మవారు అగ్నిపైన ఒంటికాలితో నిలుచుని తపస్సు చేసిన తర్వాత వివాహమై వెళ్లిపోవడం వల్ల ఇక్కడ ఉన్న అగ్నితో చుట్టుపక్కల ప్రాంతాలన్నీ తీవ్రమైన ఇబ్బందులు పడసాగాయి. ఇలాంటి స్థితిలో ఈ ప్రాంతానికి చేరుకున్న శ్రీఆదిశంకరాచార్యుల వారు అర్థమేరు శ్రీచక్రాన్ని ప్రతిష్టించి ఉగ్రత్వాన్ని తొలగించినట్లుచెప్పబడుతూంది. అప్పటి నుంచి శ్రీచక్రానికే ప్రధానమైన పూజలు, కుంకుమార్చనలు జరుగుతూ ఉండడం విశేషం. ఆలయం పక్కనే శ్రీవైకుంఠ పెరుమాళ్ ఆలయం ఉంది.

మాంగాడులో కొలువుదీరిన శ్రీకామాక్షిదేవిని గురించి భక్తుల్లో అనేక నమ్మకాలు, విశ్వాసాలు ఉన్నాయి! ప్రధానంగా పార్వతీదేవి అభీష్టం నెరవేరిన క్షేత్రం కనుక వివాహం ఆలస్యమవుతూ ఉన్నవారు అమ్మవారిని దర్శించి పూజించడం వల్ల వివాహం శీఘ్రంగా కుదురుతుందని ప్రధాన విశ్వాసం. అంతేకాకుండా కోరికలున్నవారు ఆలయ ప్రాంగణంలోని ఒక స్తంభానికి పసుపుతాళ్లను, సంతానం కోరేవారు ఊయలను కడతారు. అందువల్ల కోరికలు నెరవేరుతాయని సంతానం కలుగుతుందని విశ్వాసం. ఆరువారాలు అమ్మవారిని సేవిస్తే ఎటువంటి అభీష్టమైనా నెరవేరుతుందని భక్తులలో ప్రగాఢ విశ్వాసం ఉంది. ఈ పూజ ఏ వారమైనా ప్రారంభించవచ్చు. మొదటివారం ఆలయానికి వచ్చేటప్పుడు రెండు నిమ్మకాయలను తీసుకురావాలి. అర్చకులు వాటిని అమ్మవారి పటం వద్ద ఉంచి పూజలు చేసి ఒకటి తిరిగి ఇస్తారు. దానిని ఇంటికి తీసుకువెళ్లి ఇంట్లో ఉంచుకుని తిరిగి రెండోవారం అదేరోజు ఆ పాత నిమ్మకాయలతోపాటు మరో రెండు కొత్త నిమ్మకాయలను తీసుకురావాలి. తిరిగి ఒకటి భక్తులకు ఇస్తారు. ఈ విధంగా ప్రతివారం పాత నిమ్మకాయతో రెండు కొత్త నిమ్మకాయలు తెచ్చి అమ్మవారిని దర్శించి పూజించాలి. ఈ విధంగా ఆరువారాలు పూజలు చేసి చివరగా పాలను నివేదిస్తారు. అందువల్ల వారు కోరిన కోరికలు సిద్ధిస్తాయని ప్రగాఢ విశ్వాసం ఉన్నది. ●

# కళాప్రపూర్ణ నాయని సుబ్బారావు

ఆయన ఆ రోజుల్లోనే కళాప్రపూర్ణుడనిపించుకున్నారు. కావ్యరచనం చేసారు.

ఆయన రచించిన కావ్యాలు చాలా వరకూ అనుభవైద్యాలు. కావ్యం కవి అనుభవైక్యమైనప్పుడే రసస్ఫూర్తిని గొంటుంది.

ఆయన కలం విరిసింపచేసిన కావ్యాలన్నీ రసస్ఫోరకంగా ఉండడానికి కారణం అదే! నా చిన్నప్పుడు నాయని సుబ్బారావుపై మనోరంజితమైనపాటలను వినేవాడిని. జానపద, చారిత్రక, పౌరాణిక, ఐతిహాసిక పరిజ్ఞానం కలిగినవారే, చక్కటి గేయ కావ్య రచయితలౌతారు.

నేను విని అనుభవించి సరస స్ఫూరిత గేయాల్లో బసవరాజు అప్పారావుగారు. వారికి పూర్వం గురజాడ అప్పారావుగారూ, సినిమా పాటల రచనల్లో కొసరాజు రాఘవయ్య చౌదరి గార్లు నా ఊహకందిన వారు. ఆ అనుభవంతో నాయని సుబ్బారావుగారిపై నాలుగు మాటలు చెప్పుకుందాం.

తెలుగు సాహిత్యంలో ఏ కొద్దిపాటి పరిచయం ఉన్న వారకైనా గుర్తుకొచ్చే సాహితీవేత్త. ఆయన గ్రంథాలలో సౌభద్రుని ప్రణయయాత్ర ఒకటి. దాని రచయిత నాయని సుబ్బారావు సత్సంప్రదాయపాలకులు. నాయని సాహితీమూర్తులైన బంధువుల మధ్య బాల్యాన్ని గడిపిన వ్యక్తి.

నాయని సుబ్బారావు తల్లి ఉదయమ్మ భక్తురాలు. తండ్రి కృష్ణారావు పదిమంది మంచి కోరే సహృదయుడు. తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఈ లక్షణాలే బంధుమిత్రులకు, సాహితీ బంధువులకు చేయూతనివ్వడానికి ప్రేరకాలయ్యాయి.

పసితనం నుంచి ఇంట్లో పెద్దల ద్వారా విన్న పౌరాణిక, జానపద, చారిత్రాత్మక కథలు, పాటలు, కావ్యాల్లోని రసాత్మక సన్నివేశాలు నాయని సుబ్బారావును తదనంతర కాలంలో ఉత్తమ కవుల్లో ఒకరిగా ఎదగడానికి దోహదపడ్డాయి.

నాయని సుబ్బారావు మూడవ ఫారం చదువుతున్న రోజుల్లో ఉపాధ్యాయులైన కురుగంటి శ్రీరామశర్మ, అక్కరాజు నరసింహారావు మొదలైనవారు ఖాళీ సమయాల్లో పద్యాలు చదువుతూ విద్యార్థులతో కూడా పద్యాలు చదివిస్తూ ఉండటం వల్ల తనకు పద్య సాహిత్యంపై అనురక్తి, ఆసక్తి కలిగాయని ఆయనే చెప్పుకున్నారు. ఇంటర్మీడియట్, బి.ఎ. చదివేనాటికి విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు, దేవులపల్లి వంటి కవులతో స్నేహమేర్పడింది. భావుకవుల స్నేహంతో వారి సాహితీ సమితిలో సభ్యుడిగా చేరారు.



సౌభద్రుని ప్రణయయాత్ర రచనతో ఆయన భావకవుల్లో ఒకరిగా పేరుప్రఖ్యాతులు పొందారు. భావకవుల్లా ఊహాప్రేయసి చుట్టూ కవితలల్లారు. నాయని సుబ్బారావు ప్రేయసి మాత్రం కవుల ప్రేయసిలా ఊహాసుందరి కాదు. స్వయానా మేనమామ కుమార్తె. ఆమెను నాయనికిచ్చి వివాహం చేస్తానని మేనమామ మాట ఇచ్చారు. కొన్ని కారణాల వల్ల ఆయన ఈ వివాహం చేయడానికి నిరాకరించారు. మరదల్ని వివాహం చేసుకోలేకపోతున్నందుకు కలిగిన బాధను నాయని కవితా రూపంలో వెల్లడించారు. ఆయన వివాహం చూడకుండానే తల్లి మరణించింది. ప్రేయసి దక్కకపోవడానికి తోడు తల్లి మరణం నాయినిని మరింతగా కృంగదీసింది. తల్లి మరణానంతరం ఆయన దుఃఖం కవితారూపంలో మాతృగీతాలుగా వెలువడినవి. అనంతర కాలంలో మేనమామ తన పట్టువీడి తన కుమార్తెను నాయనికి ఇచ్చి వివాహం చేసారు. అప్పటి వరకూ సాగిన విరహగీత రచనాయాత్ర ఫలశ్రుతితో ఆనందయాత్రగా ముగుస్తుంది. ఇది సౌభద్రుని ప్రణయ యాత్ర.

సౌభద్రుని ప్రణయ యాత్ర, మాతృగీతాలతోపాటు ఆయన ఏకైక కుమారుడు మరణించినప్పుడు విషాదాన్ని తట్టుకోలేక విషాదమోహనం రచించారు. ఇవేకాక వేదనావాసుదేవము, భాగ్యనగర కోకిల తదితర పలు గ్రంథాలను రాశారు. ఉపాధ్యాయ వృత్తినుంచి పదవీ విరమణ చేసిన తరువాత ఆయన హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. హైదరాబాద్ ఆకాశవాణిలో పనిచేశారు. ఆ కాలంలో రేడియోలో కోసం అనేక రచనలను రాశారు. నాయని సుబ్బారావును ఆంధ్రవిశ్వవిద్యాలయం 1978లో కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. ●

# విజ్ఞానవేత్త, చారిత్రక పరిశోధకుడు శ్రీకొమర్రాజు లక్ష్మణరావు

తెలుగువారికి వారి చరిత్ర, పరిశోధనల్ను పరిచయం చేసి, తెలుగులో చరిత్ర, వైజ్ఞానిక గ్రంథాల కొరత తీర్చటానికి మహోద్యమాన్ని ప్రారంభించిన విజ్ఞానవేత్త, చారిత్రక పరిశోధకుడు శ్రీకొమర్రాజు లక్ష్మణరావు. కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పెనుగంచిప్రోలులో 18-05-1876 తేదీన ఆయన జన్మించారు. తండ్రి వెంకటప్పయ్య, తల్లి గంగమ్మ. వెంకటప్పయ్య గారి ప్రథమ భార్య సంతానం అచ్చమాంబ, బండారు అచ్చమాంబగా ప్రసిద్ధిగాంచిన కవయిత్రి. లక్ష్మణరావుగారు వెంకటప్పయ్యగారి రెండవ భార్య సంతానం. వెంకటప్పయ్యగారు మునగాల జమీందారు రావుబహుదూరు వెంకట రంగారావు గారిదగ్గర దివానుగా పనిచేశారు. లక్ష్మణరావు గారి మూడవ యేటనే తండ్రి మరణించారు. సవతి అన్నగారు శ్రీశంకరరావు. ఆయన ఉద్యోగరీత్యా భువనగిరిలో ఉండేవారు. భువనగిరిలోనే కొమర్రాజు వారు తమ బాల్యం గడిపారు. కొన్నాళ్ల తర్వాత అక్కడ అచ్చమాంబ, బావ బండారు మాధవరావు నాగపూరులో వుంటే అక్కడికి వెళ్లారు. అక్కడి మరాఠీ మాతృభాష కావటం చేత, మరాఠీ మాధ్యమంలోనే వారి చదువు సాగింది. ఎఫ్.ఏ, బీఏ పరీక్షలు అక్కడే చదివారు. సంస్కృతం ప్రధానంగా బి.ఏ. (ఆనర్స్) పట్టా తీసుకున్నారు. ఆనాటి మహారాష్ట్ర పత్రికల్లో కొన్ని గద్య పద్య రచనలు చేశారు. 1901లో ప్రయివేటుగా కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి చరిత్రలో ఎమ్.ఏ డిగ్రీ తీసుకున్నారు. మహారాష్ట్ర దేశంలో వుండగానే 'సమాచార్' 'వివిధ విజ్ఞాన విస్తార్' పత్రికలకు సంపాదకులుగా పనిచేశారు. ప్రాచీన మహారాష్ట్ర కవి 'మోరోపంత్' రచించిన భారతాన్ని పరిశోధించి, 'కర్ణ పర్వాన్ని' ప్రకటించారు. మహారాష్ట్రలో వున్న ఆంధ్ర భాషతో ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలతో పరిచయం ఉంటూనే మాతృ భాషను మర్చిపోలేదు. సోదరి అచ్చమాంబగారితోకలిసి స్త్రీ సమస్యలు, స్త్రీవిద్యావ్యాప్తికి సంబంధించిన చాలా వ్యాసాలు వ్రాశారు. ఆమె 'అబలా సచ్చరిత్రా రత్నమాల' అనే గ్రంథం వ్రాయటానికి రచనలో సహాయం చేసారు. ఇందులో వెయ్యి సంవత్సరాల కాలంలో భారతస్త్రీల కథలున్నాయి.

పంతులుగారికి తెలుగులో చరిత్రకు సంబంధించిన గ్రంథాలు లేకపోవడం ఒక వెలితిగాతోచింది. చరిత్ర కథలు వ్రాయాలని అనిపించింది. వారు వ్రాసిన మొదటి చరిత్ర గ్రంథం 'శివాజీ చరిత్ర'. మహారాష్ట్ర దేశంలో వుండగానే వ్రాశారు. తర్వాత వారు ఆంధ్రదేశానికి మారారు. బందరు వచ్చారు. కంకిపాడు కరణంగారు కానూరు మల్లికార్జునరావుగారి కుమార్తె 'కోటమాంబ'ను వివాహం చేసుకున్నారు. 1902వ సంవత్సరంలో మునగాల జమీందారుగారి దగ్గర దివానుగా చేరారు. రాజాగారి తెలుగు సాహిత్యకృషికి సలహాలు, సూచనలు అందజేసేవారు. మునగాల జమీందారు రంగారావుగార్కి నిజాం రాష్ట్రంలో సన్నిహిత సంబంధాలుండేవి. వారివల్ల వీరికి హైదరాబాద్‌లో ప్రసిద్ధ భాషా సేవకుడు రావిచెట్టు రంగారావుగారితో పరిచయం ఏర్పడింది. ప్రసిద్ధ రచయితలు ఆదిపూడి సోమనాథరావుగారు, మైలవరపు నరసింహశాస్త్రి కలిసి రెసిడెన్సీ బజారులో వున్న రావిచెట్టు రంగారావుగారి స్వగృహంలో 01-09-1901 తేదీన 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం' గ్రంథాలయాన్ని స్థాపించారు. తెలంగాణాలో తెలుగు భాషా స్థితిని మెరుగుపరచటమే ఈ గ్రంథాలయం స్థాపక ప్రధాన ఉద్దేశం. ఇప్పటికీ యిదే పేరుతో సుల్తాను బజారు ప్రాంతంలో ప్రసిద్ధమైన సాహిత్య కేంద్రంగా కీర్తి పొందుతున్నది.

తెలుగుదేశ ప్రజలు నిరక్షరాస్యతతోను, ఆధునికి విజ్ఞాన విషయాలు తెలియని లోపంతో ఉన్నారనీ ఈ లోపాన్ని తీర్చటానికి మునగాల జమీందారుగారి ఆర్థిక బలంతో గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, అయ్యదేవర కాళేశ్వరరావు, రావిచెట్టు రంగారావుగారితో కలిసి 1906లో 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి' సంస్థను స్థాపించారు. కులమతాలు లేకుండా, ప్రాంతాలు పాటించకుండా యువకులంతా స్వరాజ్య స్థాపనకు కృషి చేసేటట్లు చెయ్యటం, స్త్రీలకు ఓటుహక్కు కల్పించటం, స్త్రీ విద్యా అభ్యున్నతికి కృషి చేయటం, అస్పృశ్యతా నివారణ, నవీన ప్రపంచపు పరిశోధనలు, ప్రపంచపు ఆధునిక రాజకీయ పరిణామాల్ను ఆంధ్ర ప్రజలకు తెలియ చెయ్యటం ముఖ్యోద్దేశం. హైదరాబాదులో స్థాపించిన కొంతకాలానికి మునగాల జమీందారుగారి నివాసం మదరాసు మారినందున ఈ ప్రధాన కేందర్రం 1908లో మదరాసుకు మారింది.

*(అండవల్లి సత్యనారాయణగారికి కృతజ్ఞతలు)*



# రచయిత, పత్రికా రచయిత సినిమా దర్శకుడు ప్రత్యగాత్మ

## సినిమాలకు కావ్యస్థానం కల్పించాడు

కథలో ఆదర్శాన్ని, కథనంలో అభ్యుదయాన్ని, దర్శకత్వంలో సమగ్రతని సమపాళ్లలో మేళవించి చిత్రాలకు దర్శకుడిగా కావ్యస్థానాన్ని కల్పించిన ప్రత్యగాత్మ పదిమాటలలో చెప్పవలసిన విషయాన్ని ఒక్కమాటలో చెప్పటం, వెయ్యి అడుగులలో చూపాల్సిన సన్నివేశాన్ని వంద అడుగులలోనే సమర్థవంతంగా చూపగలగడం ప్రత్యగాత్మ ప్రత్యేకత. 'కవిలా ఊహించి చిత్రకారుడిలా దృశ్యాన్నిరూపొందించి సాంకేతిక సమగ్రతను సాధించిన మేధావి. ప్రసాద్ ఆర్టు పిక్చర్సువారు తొలి దర్శకత్వ అవకాశం కల్పించారు.

31 అక్టోబర్ 1924న కొల్లి కోటయ్యవర్మ, అన్నపూర్ణ దంపతులకు కృష్ణాజిల్లా ముదునూరులో జన్మించారు. ప్రత్యగాత్మ ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులకు పుట్టిల్లయిన ఆ గ్రామంలో పుట్టిపెరిగిన విద్యార్థి దశలో ఆయన ఒక వైపు విప్లవ వీరుల జీవితాలకు, మరొక వైపు శాంతారాం వంటి దర్శకులకు చిత్రాలకు ప్రభావితులై క్రమంగా అతివాద రాజకీయాలకు ఆకర్షితులయ్యారు. 'ప్రజాశక్తి' విలేకరిగా కొంతకాలం పనిచేశారు. శ్రామిక వర్గానికి బాసటగా నిలుస్తూ ప్రత్యగాత్మ రాసిన 'పాలేరు' కథ 'ప్రజాశక్తి'లో ప్రచురితమై సంచలనంసృష్టించింది. ఆ తర్వాత 1947లో ఆంధ్రా యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నడచిన 'నవయుగ' పక్షపత్రికలో కొంతకాలం పనిచేశారు. ఆ రోజులలో కమ్యూనిస్టు కనిపిస్తే చాలు కాల్చి పారేసేవారు. అతివాద కమ్యూనిస్టుగా ముద్రపడిన ప్రత్యగాత్మకు ఈ కారణాల వల్ల కొంతకాలం అజ్ఞాతంలో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతకుముందే పరిచయమయిన చలసాని వాసు,ఆయన సోదరి సత్యవతి కూడా ఈ అజ్ఞాతంలో కలిశారు. 'ఒకే ఆదర్శం కోసం పోరాడే మీరిద్దరు భాగస్వాములు కండి' అని ఆశీర్వదించి ప్రత్యగాత్మకు సత్యవతికి అజ్ఞాతంలోనే పెళ్లిచేశారు చలసాని వాసు. 1950లో పోలీసుల కాల్పులలో చలసాని మరణించడంతో జనవరి 7, 1951న పుట్టిన తమ కుమారుడికి ఆయన పేరు పెట్టారు ఈ దంపతులు. ఆ వాసు పెరిగి పెద్దయి 'ప్రాణంఖరీదు', 'ఆడపిల్లల తండ్రి', 'గోపాలరావుగారి అమ్మాయి' 'షిరిడి సాయిబాబా మహత్యం' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించి తండ్రికి తగ్గ తనయుడనిపించుకున్నారు.

వాసు పుట్టిన తర్వాత ప్రత్యగాత్మ రాజకీయాలకు దూరం జరిగి, మద్రాసుకు మకాం మార్చారు. 'జ్వాల' పత్రికకు 1952లో సంపాదకుడిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆర్థిక కారణాల వల్ల ఆ పత్రిక కొద్ది రోజులకే మూతపడింది. ఇక ఎటు వెళ్లాలో ఏం చెయ్యాలో తోచక అయోమయ పరిస్థితిలో ఉన్న ప్రత్యగాత్మకు దర్శకుడు తాతినేని ప్రకాశరావు ప్రోత్సాహక హస్తం అందించి చిత్రపరిశ్రమలోకి ఆహ్వానించారు. అలా 1953లో గోకుల్ పిక్చర్సు సంస్థ నిర్మించిన 'నిరుపేదలు' చిత్రంతో రచయితగా ప్రత్యగాత్మ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఆ సినిమా విజయవంతం కాకపోయినా రచయితగా ఆయనకి మంచి గుర్తింపు లభించింది.

ఆ తర్వాత తాతినేనిప్రకాశరావు దగ్గర అసిస్టెంట్‌గా చేరి 'జయం మనదే' 'ఇల్లరికం' చిత్రాలకు పనిచేశారు. హైదరాబాద్‌లో తొలిసారిగా నిర్మితమైన 'మాఇంటి మహాలక్ష్మి' చిత్రానికి కథకుడిగానే కాకుండా సంభాషణల రచయితగా ప్రత్యగాత్మ పనిచేశారు.

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ సంస్థలో ఒక సంప్రదాయం ఉండేది. ఆ సంస్థలో అసోసియేట్ డైరెక్టర్‌గా చేసి అనుభవం గడించిన వారిని ప్రమోట్ చేసే మంచి సంప్రదాయం. ఆ ప్రకారం తాతినేని ప్రకాశరావు దగ్గర పనిచేసిన ప్రత్యగాత్మను 'భార్యాభర్తలు' చిత్రంతో దర్శకుడిగా ప్రమోట్ చేశారు ఆ సంస్థ అధినేత సుబ్బారావు. మార్చి31, 1961న విడుదలయిన 'భార్యాభర్తలు' చిత్రం సంచలన సృష్టించింది. ఆ రోజులలో అవుట్‌డోర్ షూటింగ్ అనగానే ఊటీకో, ఏర్కాడుకో వెళ్లేవారు. కానీ ఈ సినిమా కోసం విశాఖపట్నంలో తొలిసారిగా అవుట్‌డోర్ సన్నివేశాలను చిత్రీకరించిన ఘనత ప్రత్యగాత్మదే. అలాగే తెలుగులో తొలిసారిగా 'ఎ' సర్టిఫికేట్ పొందిన 'మనుషులు-మమతలు' చిత్రానికి దర్శకుడు కూడా ఆయనే. ఈ సినిమాతోనే జయలలితను పరిచయం చేశారు. స్విమ్మింగ్ షూట్ వేసుకుని జయలలిత పాడిన 'సిగ్గేస్తోందా' పాట ఎంతోమందిని ఆకట్టుకుంది.

ప్రత్యగాత్మ తొలిచిత్రంలోనూ, చివరి చిత్రం 'నాయకుడు- వినాయకుడు' లోనూ హీరో అక్కినేని. ఏడు హిందీ చిత్రాలను ఆయన రూపొందించారు. అలాగే 'బచపన్' చిత్రాన్ని నిర్మించారు. తెలుగులో ఆయన నిర్మించిన 'చిలకా గోరింకా' సినిమా ద్వారా కృష్ణంరాజు, రమాప్రభ పరిచయమయ్యారు. రచయితగా, దర్శకుడిగా తెలుగు చిత్రపరిశ్రమకు విశిష్టసేవలు అందించిన ప్రత్యగాత్మ జూన్ 8, 2001న కన్నుమూశారు. ●



# చేతిలోని వెన్నముద్దగా భగవద్గీతను పలుసైజులలో ప్రచురించిన ఆధ్యాత్మిక సంస్థ గీతా ప్రెస్సు ఒక్కటే!



భగవద్గీతను పలు సైజుల్లో తెలుగులో వెలువరించిన ఘనత గీతాప్రెస్సుదే!

గోరఖ్‌పూర్ అనగానే గీతాప్రెస్ గుర్తుకు వస్తుంది.

జయదయాళ్ గోయంకా గుర్తుకు వస్తారు. ఏ తెలుగువాడూ ప్రచురించని పలురకాల పలు సైజుల 'భగవద్గీత'లను గీతా ప్రెస్సు ప్రచురించింది. ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచురించినప్పటికినీ– 'భగవద్గీత' గ్రంథప్రచురణకే ప్రాచుర్యం తెచ్చిన సంస్థ గీతాప్రెస్సు.

## ఆధ్యాత్మిక విజ్ఞానగని...గీతాప్రెస్

ఆధ్యాత్మిక పుస్తకాలకు చిరునామా. సామాన్యుడికి సైతం వారి పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. సుమారు 50 కోట్ల పుస్తకాలను ప్రచురించిన ఆధ్యాత్మిక వారథి... గీతాప్రెస్.

కర్మలను ఆచరించడమే నీ ధర్మం. వాటి ఫలితం గురించి ఆలోచించవద్దు... సరిగ్గా గీతాకారుడు చెప్పిందే చేశారాయన. భగవద్గీత మన జాతికి లభించిన దివ్యౌషధం. అద్భుత వ్యక్తిత్వ వికాస గ్రంథం. ఆ గీత గొప్పతనం తెలిసినవారు ఆయన కాబట్టే దాన్ని అందరికీ అందుబాటులోకి తేవాలనుకున్నారు. గీతాప్రెస్ ప్రారంభించారు. ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని ప్రచురించే గీతా యజ్ఞం మొదలుపెట్టారు.

## గీతను ఔపోసనపట్టిన జయదయాళ్ గోయంకా

1886లో రాజస్థాన్‌లో జన్మించారు. 22 ఏళ్లకే గీతను ఔపోసన పట్టిన ఆయన కొందరు శ్రేయోభిలాషుల కోరికమీద గీతను పుస్తకరూపంలో తేవాలనుకున్నారు. ఈ విషయం తెలిసిన ఘనశ్యామ్‌దాస్ జాలాన్, మహావీర్ ప్రసాద్ పోద్దర్ అనే ఇద్దరు వ్యక్తులు ముందుకొచ్చి గోరఖ్‌పూర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ప్రింటింగ్ ప్రెస్ ప్రారంభించారు. భగవద్గీత ముద్రించడానికి ఏర్పాటు చేసిన ప్రెస్ కాబట్టి దీనికి గీతాప్రెస్ అని పేరుపెట్టారు. ఇక్కడ 'గీత'ను వేర్వేరు సైజుల్లో ముద్రించేవారు. వాటికి ఆదరణ పెరిగింది. కాపీల సంఖ్య పెరగడంతో ముద్రణకు స్థలం సరిపోలేదు. అందువల్ల మరో పెద్దభవనం తీసుకున్నారు.

మొదట్లో భగవద్గీతకే పరిమితమైన ఆ ప్రెస్‌లో తరవాత్తరవాత ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలనూ ముద్రించేవారు. వాటినీ తక్కువ ధరకే అమ్మేవారు. ఆ తరువాత 1926లో హిందీలో 'కళ్యాణ్' మాసపత్రికను ప్రారంభించారు. 200 మంది చందాదారులతో ప్రారంభమైన ఈ పత్రిక సర్కులేషన్ ప్రస్తుతం 2.5 లక్షలు. 1934లో 'కళ్యాణ్‌కల్పతరు' అనే ఆంగ్ల పత్రికనూ ప్రారంభించారు. ప్రస్తుతం దీని సర్కులేషన్ 1.15 లక్షలు.

వీరు మహాత్మాగాంధీ ప్రశంసను పొందారు. మహాత్మాగాంధీ ప్రతినెలా 'కళ్యాణ్'ను చదివేవారు. ఓసారి గాంధీజీ మహావీర్ ప్రసాద్‌తో మాట్లాడుతూ 'ఇదో అద్భుతమైన పుస్తకం. దీని గొప్పతనాన్ని ఇలాగే కాపాడాలంటే ఇందులో వ్యాపార ప్రకటనలకు చోటివ్వకండి' అని సూచించారట. అప్పట్నుంచీ ఈ పత్రికలను ప్రకటనలు లేకుండానే నడుపుతున్నారు. గీతాప్రెస్‌లోగానీ, అనుబంధ సంస్థల్లోగానీ ఎక్కడా చందాలు, విరాళాలు తీసుకోరు.

ఆధ్యాత్మిక గ్రంథాలను హిందీ, ఇంగ్లీషు భాషలకే పరిమితం చేయకుండా ఇతర భారతీయ భాషల్లోనూ ముద్రించాలని గీతాప్రెస్ 1994లో నిర్ణయించింది. అలా 1995లో తెలుగులో మొదటి ప్రచురణ వచ్చింది. మొత్తమ్మీద 14 భారతీయ భాషల్లో ప్రస్తుతం అనువాద రచనలు జరుగుతున్నాయి. గీతా ప్రెస్‌లో పుస్తకాల ముద్రణకు ప్రతినెలా 400 టన్నుల కాగితం అవసరమవుతుంది.

## దేవాలయం లాంటి భవనం

ఆధ్యాత్మిక పుస్తకాలను ప్రచురించే గీతాప్రెస్ చూడటానికి దేవాలయంలానే ఉంటుంది. ప్రవేశ ద్వారానికి ఏర్పాటు చేసిన గోపురం ఉపనిషద్ వాక్యాలతో మన సనాతన ధర్మానికి ప్రతీకేమో అనిపిస్తుంది. ఈ ద్వారం పైభాగంలో శ్రీకృష్ణార్జునుల రథం కనువిందు చేస్తుంది.

ఇందులో గీతాప్రెస్‌తోపాటు చెప్పుకోవాల్సిన మరో అంశం... 'లీలాచిత్ర మందిరం' గీతా ప్రెస్‌కు తలమానికంగా చెప్పే ఈ భవనాన్ని 1955లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఇందులో భగవద్గీతలోని శ్లోకాలను రాళ్లపై అందంగా చెక్కి గోడలపై ఉంచారు. అలాగే రాముడి, కృష్ణుడి జీవిత లీలా చిత్రాలను చూడొచ్చు. ఇవికాక, శివుడు, విష్ణువు తదితర దేవుళ్ల చిత్రపటాలూ ఉన్నాయి.

గీతాప్రెస్‌లో తెలుగులో ఇప్పటివరకూ 160 పుస్తకాలను ముద్రించారు. ఒక్క భగవద్గీతనే 13 రకాలుగా ముద్రించారు. రూపాయి మొదలుకొని రూ.160 వరకు ధరల్లో గీతలు లభిస్తున్నాయి. ఇవేకాకుండా నిత్యస్తోత్ర పారాయణ పుస్తకాలు, భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు, బాలలూ మహిళలకు సంబంధించిన చిత్రావళి కథలూ వస్తున్నాయి అని గీతాప్రెస్‌లో 13 ఏళ్లు పనిచేసన హైదరాబాద్ వాస్తవ్యులు ముదునూరి వెంకటరామశర్మ అంటారు.

గీతాప్రెస్ ఇప్పటివరకూ సుమారు 8 కోట్లకు పైగా భగవద్గీతలు ముద్రించింది. తులసీదాస విరచిత 'రామచరిత మానస' పుస్తకాలూ 8 కోట్లకుపైనే ముద్రించింది. ఉపనిషత్తులు, పురాణాలు సుమారు 3 కోట్లు, మహిళలూ బాలలకు ఉపయోగపడే పుస్తకాలు 11 కోట్లు, భక్తచరిత్రలు, నీతికథలు ఇతరాలు సుమారు 18 కోట్లు ముద్రించింది. గీతాప్రెస్ పుస్తక ప్రచురణకే పరిమితం కాలేదు. సేవా కార్యక్రమాలూ నిర్వహిస్తోంది. ఇందులో మొదటిది రుషికుల బ్రహ్మచర్యాశ్రమం. ఇది రాజస్థాన్‌లోని చురూలో ఉంది. ప్రాచీన గురుకుల విద్యాపద్ధతికి ఆధునిక విద్యను జోడించి ఉత్తమ విలువలతో ఉచితంగా విద్యను బోధిస్తారిక్కడ.

ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు వంటివి సంభవించినప్పుడు గీతాప్రెస్ ఆపన్నులకు సాయంచేస్తుంది. మూడోది ఆయుర్వేద్ సంస్థాన్. హిమాలయాల్లో లభించే ఔషధ మొక్కలు, గంగాజలంతో ఆయుర్వేద ఔషధాలను తయారు చేస్తారు. తరువాతది వస్త్రవిక్రయ విభాగం. ఈ చేనేత విభాగమే గీతాప్రెస్‌కు ప్రధాన ఆదాయ వనరు. మనరాష్ట్రంలోనూ హైదరాబాద్, సికింద్రాబాద్, తిరుపతిలలో ఈ పుస్తక విక్రయ కేంద్రాలున్నాయి. హైదరాబాద్‌నందు ఆయుర్వేద ఔషధ విక్రయ విభాగం కూడా ఉంది. ●

# నా తెలంగాణా కోటిరత్నాల వీణ - యని నినదించిన కవి దాశరథి!



ఆయనకు సంస్కృతం వచ్చును. సంస్కృతి నెరుగును! కానీ తిలకాష్ట మహిష బంధనమ్– అనే చాదస్తపు తీరు ఆయన వద్ద లేదు. నిప్పుల్ని కూడా కడిగేంతటి సాంప్రదాయ కుటుంబంలో పుట్టారు. సాంప్రదాయ కవిత్వమూ వ్రాసారు. సాహస విప్లవ కవిత్వమూ వ్రాసారు. సినిమా రంగంలో కవిగా ప్రవేశించి అందరికీ చేరువయ్యారు. దాశరథి పూర్తిపేరు దాశరథి కృష్ణమాచార్య.

అగ్ని కణాలవంటి ఆయన అక్షర భీకరతకు, ఆప్యాయంగా, అనంత ప్రియంగా వ్రాసిన కవిత్వానికి – దూరం లేదంటూ చిన్మయంగా కనిపించే ఆయన పెదవులే సాక్షి. ఆయన నాకొక మంచి మిత్రుడు– **గోటేటి.**

"నువ్వు ఎటు వెళుతున్నావ్?" అనడానికి "త్వకుంత్ర గచ్ఛసి" అనాలనేంతటి పట్టుదల వున్న ఇంట్లో జన్మించాడు దాశరథి. కానైతే ఆయనకు అంతటి సంస్కృత 'ఛాందసం' నచ్చేది కాదు. 'తెలుగుమీద దండయాత్ర' జరుగుతున్న నిజాం కాలేజీలో చదువుకున్నాడు. ఆయన అదీ సహించేవాడు కాదు. ఈ కారణాల వల్లేనేమో ఆయనలో రెండు పరస్పర విరుద్ధాంశాలు అద్భుతంగా సంలీనం చెందు తీరు కని పిస్తుంది. సంప్రదాయంలో బతుకుతూనే విప్లవమార్గాన్ని అనుసరించాడు. 'పాతబూజు'గా ఎద్దేవా అవుతున్న పద్యాల్లోనే అభ్యుదయాన్ని కలగన్నాడు. దాశరథికి సాహిత్యం కేవలం సాహిత్యం కాదు. అది నిర్బంధం. చిత్రహింసలకు వ్యతిరేకంగా జాతిని జాగృతం చేయాల్సిన పవిత్ర కర్తవ్యం. అందువల్లే 'అగ్నిధార', 'రుద్రవీణ' 'మహేంద్రోదయం' 'పునర్నవం' 'తిమిరంతో సమరం' లాంటి కావ్యాలు వెలువరిం చారు. అగ్నిధార అనే పేరేవిటని కొందరు ఆక్షేపించారు. అగ్ని ధారలా ప్రవహిస్తుందా? అన్నారు మరికొందరు. విద్యుత్ అగ్ని కాదా? అది ప్రవహించదా?' అన్నాడు దాశరథి. అగ్నిని చైతన్యానికి సంకేతంగా, అది ఒక మానవహృదయంలో నుండి ఇంకొకనిలోకి ప్రవహించి, జాతినంతటినీ ఏక సూత్రాన కట్టిపడేసేదిగా ఆయన భావించారు.

'నా గమ్యం ప్రపంచశాంతి, నా ధ్యేయం ప్రజాస్వామ్య శాంతి సామ్యవాదం అని దాశరథి జీవితాన్నే పోరాటంగా మలచుకున్నారు. 'తిమిరంతో ఘన సమరం, జరిపిన బ్రతుకే అమరం' అన్నాడు. 'ఈ కొరగాని లోకమున కిప్పుడె నిప్పురగల్చి కాల్చి, నాలో కదలాడు వూహలకు రూపమొసంగి పునస్సృజింతు' అన్నాడు. కార్యాచరణ కూడా కవి కర్తవ్యంగా భావించినవాడు కాబట్టి కటకటాలపాలయ్యాడు.

1948లో ఆయన్ని వరంగల్లు జైలు నుంచి నిజామాబాద్ జైలుకు మార్చినపుడు మొదట వట్టికోట ఆళ్వారుసామి కనిపించి సంబరపడ్డాడట. వట్టికోట కోసం దాశరథి జైలుగోడమీద బొగ్గుతో ఈ పద్యం రాశాడు. 'ఓ నిజాము పిశాచమా! కానరాడు / నిన్ను బోలిన రాజు మాకెన్నడేని / తీగెలను తెంపి అగ్నిలో దింపినావు/ నా తెలంగాణా కోటి రత్నాలవీణ'.

గాఢమైన యౌవన ప్రాయంలో ఆయన జైలుగోడల్లో బందీ అయ్యాడు. కానీ ఆయన మధురస్వప్నాల్ని ఎవరు బంధించగలరు? అంగారం శృంగారం నీ రచనలో కలగలసి ఉంటాయి అనేవారు ఆయనపై చనువున్న మిత్రులు. సైనికుడు యుద్ధంలో పోరాడుతూ అప్పుడప్పుడూ తన ప్రియురాలి అందమైన కళ్లను తలచుకోవడం అస్వాభావికమా; అని ప్రశ్నిస్తాడు దాశరథి. భయానక ఒంటరి క్షణాల్లో వాళ్ల ఊరి నదికి మంచినీళ్లు తీసుకుపోవడానికి వచ్చే పచ్చని అమ్మాయి తలపుల్లో మెదులు తుండేదట! ఆకాశంలోకి తలెత్తి చూస్తే, మేఘాలు అందమైన అమ్మాయిల ఆకారాలు ధరించి, పొంగిన వక్షస్థలాలతో కవ్వించేవట! మరోపక్కేమో జైలు భార్యకు, నగ్న ఖడ్గం ధరించి తుపాకీ భటుడు కనిపించేవాడు. వాణ్ని నరికేసి లేదా వానిచే నరకబడి, ఆకాశంలోని మేఘభూమివైపు సాగిపోవాలనిపించేదట! ఏ శషభిషలు లేకుండా రాయడం దాశరథి నిజాయితీ.

"నేను పోతన కవిశానపుగంటములోని ఒడుపుల కొన్నింటిని బడసినాను" అని తన అభిమానాన్ని వెల్లడించిన దాశరథి 'మంచికవిత్వం ఏ భాషలో వుంటే అది నా భాష. మంచి కవి ఎవరైతే అతడు నామిత్రుడు. అని తన రసహృదయాన్ని చాటుకున్నాడు. గాలిబ్‌ను అందువల్లే ఆయన పలవరించివుండొచ్చు. దాశరథిని తలచుకోవడానికి గాలిబ్‌గీతాల అనువాదం ఒక్కటి చాలు. "ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదు. లెమ్ము/ నరుడు నరుడౌట యెంతో దుష్కరము సుమ్ము' 'దేవి! మన పూర్వబంధమ్ము త్రెంచబోకు/ ప్రేమలేకున్న నుండనీ ద్వేషమేనీ, 'మనిషి ఏకాకియౌను మనసులోన/ గుంపులుగ భావములు జేరి గోష్ఠి జరుపు కవితలు.

ఇక... "ఖుషీఖుషీగా నవ్వుతూ చలాకి మాటలు రువ్వుతూ... 'నా కంటిపాపలో నిలిచిపోరా, నీ వెంట లోకాలు గెలువనీరా' 'ఆ చందమామలో ఆనందసీమలో వెన్నెల స్నానాలు చేయుదమా..' సినిమా పాట స్థాయిని దిగజార్చకుండా పాటలు రాసిన అతికొద్ది మంది కవుల్లో దాశరథీ ఒకరు.

ఆయన 'ఆంధ్రప్రదేశ్ తొలి ఆస్థానకవి'గా నియమితుడయ్యాడు. 'యాత్రాస్మృతి' పేరిట చక్కటి వచనం రాశాడు. ఆయన్ని ఎరిగినవారు 'స్నేహశీలి, మృదుస్వభావి, నిరాడంబరుడు అని చెబుతారు అది నిజం! ●

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**

# పొణకా కనకమ్మగారు!

పొణకా కనకమ్మ 1892లో జన్మించారు. 1963లో 71వ ఏట మరణించారు. అప్పటికామె నూటయాభై ఏళ్లకు సరిపడే సాహిత్య కృషి చేశారు. కనకమ్మగారి స్వీయ చరిత్ర 'కనకపుష్యరాగం' చదివితే విశదమవుతుంది స్త్రీలు ఎంతెంత పనులు, చరిత్రను మలుపుతిప్పే ఎన్నో కీలకమైన పనులు చేసి కూడా మరుగున పడి ఉండవలసి వస్తుందో ఇప్పటి సమాజం తెలుసుకోవాలి. కనకమ్మగారి స్వీయచరిత్ర చదువుతుంటే తెలుస్తుంది. ఇంతగా సామాజిక, రాజకీయ కార్యక్రమాలలో మునిగినది పురుషులైతే వారు ఎన్ని పదవులు అధిష్టించేవారో, ఎంత అధికారం పొందేవారో, ఎన్ని విగ్రహాలు ప్రతిష్టించబడేవోనని! స్త్రీలు ఆ పదవీ, అధికార, విగ్రహారాధనల కోసం తహతహలాడకుండా ఆ దారిలో నడవనందుకు సంతోషించాలో, వారు ఆయారంగాలలో పనిచేస్తూ ఏర్పరచిన విలువల, ప్రజాస్వామ్య సంస్కృతి, ఇవన్నీ ప్రజలకు తెలియకుండా ఆ చరిత్ర అందకుండా పోయిందని విచారించాలో తెలియనిది కాదు – నిజానికి దాన్ని తప్పకుండా విచారించాలి. ఇప్పటికైనా కాళిదాసు పురుషోత్తంగారు పుణ్యం కట్టుకోబట్టి మన బంగారం మనకు దొరికింది. ప్రజలకు కావలసిన అసలైన నిధులు ఇలాంటి పుస్తకాలే!

ఆ రోజుల్లో 14, 15 సంవత్సరాల అమ్మాయి ఒకరు ఇల్లు ఎంత ముఖ్యమో సమాజమూ అంత ముఖ్యమని గ్రహించుకుని, ఇంటినీ సామాజిక రాజకీయ జీవితాన్నీ సమతూకం చేసుకుంటూ తన జీవితాన్ని గడిపిన తీరు ఈ పుస్తకంలో చాలా సింపుల్‌గా చెప్పారు. అదేదో విశేషం కాదన్నట్టు, సర్వ సాధారణమన్నట్లూ ఆమె చెబుతున్న విషయాలన్నీ మన దేశ చరిత్రలో ముఖ్యఘట్టాలు. నేనింత చేశాననే ధోరణి లేకుండా ఇంతే చేయగలిగాను అన్నట్టు చెప్పే కనకమ్మగారిని గాఢా లింగనం చేసుకున్న తృప్తి కలుగుతుంది ఈ పుస్తకం చదివితే!



1907వ సంవత్సరంలో బిపిన్‌చంద్రపాల్ నెల్లూరు వచ్చి కనకమ్మగారి ఆతిథ్యం స్వీకరించి బహిరంగ సభలో మాట్లాడి ఆమెను ఆశీర్వదించివెళ్లాడు. ఇక అక్కడి నుంచి కనకమ్మగారి జీవిత చరిత్రకు దేశచరిత్రకు పెద్ద తేడా కనిపించదు. ఆంధ్రదేశపు రాజకీయ సాంస్కృతిక చరిత్రను నిర్మించిన తాపీ మే 'స్త్రీ'లలో కనకమ్మగారు అతి ముఖ్యులు. 1913 నాటికి 'సుజనరంజని సమాజ' స్థాపనలో భాగం పంచుకున్నారు. 1914 నాటికి అతివాదిగా మారి, నిషిద్ధ సాహిత్యాన్ని ప్రచురించటం, పాండిచ్చేరి నుంచి తుపాకులు వస్తే వాటిని దాచటంలో ఉత్సాహపడటం, హిందూ సుందరి, అనసూయలాగా రాసి చెట్టునీడ కనకమ్మదారిగా గుర్తింపు పొందటం, 1918లో హోంరూలు ఉద్యమానికి మద్దతుగా పనిచేయడం, ఇలా ఒకదాని తర్వాత ఒకటి ఎన్ని పనుల్లో క్రియాశీలంగా పాల్గొన్నారో చెప్పలేం. ఆ ఉత్సాహం, జాతి నిర్మాణంలో భాగస్వామ్యం కావాలనే కోరిక ఎంత ఉందంటే ఆవిడ ఇంట్లో కూర్చున్న రోజులు చాలా తక్కువ. 1919లో మద్రాసు వెళ్లి తిలక్‌ని కలిశారు. 1921లో బెజవాడ వచ్చిన లాలాలజపతిరాయ్‌ని కలిశారు. 1919లోనే దరిశి చెంచయ్యగారి పరిచయంతో గదర్‌పార్టీ గురించి అర్థం చేసుకున్నారు.

## బాలికల పాఠశాల స్థాపన

రాజకీయాలే కాదు పుస్తక ప్రచురణ చేపట్టి దీపాల పిచ్చయ్య శాస్త్రీ 'స్వప్న ప్రయాణం' దువ్వూరి రామిరెడ్డి 'మాతృశతకం' ప్రచురించారు. అవి సామాన్యమైన పుస్తకాలా! బ్రిటిష్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తగలబెట్టిన పుస్తకాలు. 1921లో అహమ్మదాబాదు కాంగ్రెస్ సభలకు వెళ్ళి అక్కడ తొలి ఉపన్యాసం ఇచ్చారు. అక్కడి నుంచి గాంధీ ఆశ్రమం, బొంబాయి, పూనా అన్నీ చూసి వచ్చారు. 'జమీన్‌రైతు' పత్రిక స్థాపన ఈమె కుటుంబం నుంచే జరిగింది. మాలపల్లిలో ప్లూ వస్తే పల్లెలో అందరికీ జావ, మందులు కనకమ్మ గారింటి నుంచే వెళ్లేవి. కాంగ్రెస్ సభలు నెల్లూరులో జరిగితే ఆ రెండు రోజుల వంట పెత్తనమూ ఆమెదే. చివరిరోజు బహిరంగ సభలో అధ్యక్ష స్థానమూ ఆమెదే! రాయలసీమలో కరువు వస్తే నరసా పురంలో నాటకంవేసి టికెట్లమ్మి డబ్బుపంపే సహాయశీలి. ఆమె మద్రాసులో స్త్రీల రాజకీయసభలో పాల్గొని అధ్యక్షత వహించమని కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారంతటివారు అడిగితే నిరాకరించగలిగినంత గుండె నిబ్బరం ఆమె స్వంతం.

ఆమె స్థాపించిన కస్తూరీబాయి బాలికల పాఠశాల కోసం ఆవిడ చేసిన కష్టం అంతా ఇంతా కాదు. 1929లో ఆ విద్యాలయ శంఖుస్థాపనకు గాంధీగారిని రప్పించి, రామదాసు నాటక ప్రదర్శన వేయించి ఆయనకు చూపించింది. అందరి దగ్గరా డబ్బు వసూలు చేసుకువెళ్లే గాంధీగారి దగ్గర పల్లెపాడు సత్యాగ్రహాశ్రమానికి డబ్బు వసూలు చేసింది. గాంధీతో ఆమెకు చాలా అనుబంధం. ఉప్పు సత్యాగ్రహ సమయంలో జైలుకి వెళ్లే ముందు, స్కూలుకు ఇబ్బంది లేకుండా అప్పుతెచ్చి ఉంచే ముందు చూపు. మొదటి ఎగ్జిబిషన్ కూడా ఆమే పెట్టింది. నెల్లూరులో చేతివృత్తుల, కళాకారుల నైపుణ్యాల ప్రదర్శన, ఉప్పల లక్ష్మణరావు, మెల్లిగారు అక్కడ తమ ఖద్దరు ప్రదర్శించారు.

1034లో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘానికి ఉపాధ్యక్షులుగా పనిచేశారు కనకమ్మ. 1937లో శాసనసభలలో స్త్రీలు అధికంగా ఉండాలని ఆ సభ్యత్వానికి దరఖాస్తు పంపారు. ఆమె మాటల్లోనే అప్పుడు జరిగింది తెలుసుకుందాం. "ఆడవాళ్లనే నెపముతో కాబోలు నన్ను తీసుకోలేదు. చివరకు నేను కట్టిన పైకము కూడా తిరిగి రాలేదు. స్త్రీలకు ప్రాతినిధ్యము కావలయునని ఊరక మాట్లాడే దానికంటే కార్యము చేసి చూపించేది శ్రేష్టము గదా. అదేగదా అత్యుత్తమ లక్ష్యము" మాటలకంటే చేతలు ముఖ్యమని మనసా వాచా కర్మణా నమ్మిన వ్యక్తి కనకమ్మ. సంపూర్ణ స్వతంత్ర తీర్మానం గురించి కాంగ్రెస్ మహాసభలలో స్త్రీల తరపున మాట్లాడే రాజకీయ పరిణతి ఆమెది. బెంగళూరు నాగరత్నమ్మతో పరిచయాన్ని స్నేహంగా చేసుకుని ఆనందించిన స్నేహశీలి.

త్యాగరాజస్వామి సమాధికి బెంగుళూరు నాగరత్నమ్మ పూనుకున్నప్పుడు కనకమ్మగారూ తన వంతు సాయం చేశారు. స్నేహమన్నపుడు కనకమ్మగారి స్నేహితురాలు ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగారి గురించి చెప్పుకోవాలి. ఉద్యమాలలో ఇంత సుదీర్ఘ కాలం స్నేహితులుగా ఉండి, ప్రతి పనీ కలిసి చేయడం, కష్టాలు కలిసి పంచుకుని ఆనందించడం చాలా అరుదుగా జరుగుతుంది. అందులో స్త్రీల విషయంలో మరీ అరుదు. వీరిద్దరి స్నేహం ఎన్నో మంచి పనులు చేయించింది.

పద్యరచన, వ్యాసాలు రాయడంతోపాటు 1932లో జైలుకి వెళ్లినపుడు మహారాజ నందకుమార్ రాసిన 'ఉరి' అనే పుస్తకాన్ని హిందీ నుంచి తెలుగులోకి అనువాదం చేశారు. రాయప్రోలు సుబ్బారావు, కాంచపల్లి కనకమ్మగార్లతో ఆమెకు మంచి స్నేహం ఉండేది. మద్రాసులో ఒకసారి ఈమె తెలుగులో మాట్లాడితే రాజాజీ అంతటివాడు తమిళంలోకి అనువాదం చేశారు. నెల్లూరులో ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాట కచేరీ నిర్వహించి విద్యాలయానికి లక్ష రూపాయలు వసూలు చేసింది. నెల్లూరుకి రాని నాయకులు, కళాకారులు లేరు. ఉదయశంకర్ దంపతులు, ఘంటసాల, నాగయ్య, లలిత, పద్మిని ఒకరు కాదు – కనకమ్మగారి కళాహృదయానికీ, సామాజిక బాధ్యతకూ లొంగనివాళ్లు ఆ కాలంలో ఎవరూ ఉన్నట్టు లేదు. 1947కుముందే బాలికలకు పారిశ్రామిక విద్యాలయం స్థాపించాలనే ఆలోచన చేసిన దూరదృష్టి ఆమెది. దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు నెల్లూకు ఇంత చేసిన ఆమెకు ఆ ఊరిపెద్దలు ఏదో చెయ్యాలి కదా, ఆమె స్థాపించి అభివృద్ధి చేసి, కంటిపాపలా కాపాడిన స్కూలులో ఆమె అండగా నిలబడి మాట్లాడిన వారు, ఆమెను స్కూలు నుంచి దూరం కాకుండా చేయగలిగిన వారూ లేరంటే ఆమె మీద ఎంత కోపం ఉండి ఉండాలి? అంత కోపం ఎందుకు? స్వస్థలంలో అంత పనిచేసి అందరికంటే ప్రసిద్ధురాలవుతుందా? దుర్గాబాయమ్మగారిలా మరో ఊరిలో అయితే ఫరవాలేదు గానీ ఎక్కడ పుట్టిందో అక్కడే ఇంత పేరంటే అక్కడున్న ఎంతమంది స్త్రీల సామాజిక శ్రమను, పురుషులు దురాక్రమించారో, అనుభవించారో తల్చుకుంటే గుండె మండిపోతుంది. ఆమె చనిపోయినా కోపమే. ఆమె స్థాపించిన స్కూలు విద్యార్థినులు, అధ్యాపకులు ఆమె భౌతిక కాయాన్ని చూడడానికి కూడా నిషేధమే. ఆమె కాంస్య విగ్రహం పెట్టుకుని ఎప్పుడన్నా ఓ పూలమాల వేసి తల్చుకోటానికి కూడా నెల్లూరు వాసులకు అదృష్టం లేదు. ఇంకా ఇంకా వేగంగా వెయ్యి చేతులతో చేయాలి స్త్రీలు. అన్న గురజాడ వాక్యంలో కీలకమైన మాట మర్చిపోకూడదు. ఆధునిక స్త్రీ చరిత్రను పునర్లిఖించాలి. కనకమ్మగారి స్వీయచరిత్రలో మనకు పుష్కలంగా ఎన్నో విషయాలు దొరుకుతాయి. ఆ పునర్ లేఖనానికి ఈ రూపంలో తోడ్పడిన 'పురుషోత్తములకు' చేతులెత్తి నమస్కరించాలి. కాళిదాసు పురుషోత్తంగారు చేసిన ఈ అమూల్యమైన ప్రయత్నానికి స్త్రీలందరి తరపునా ధన్యవాదాలు చెప్పాలి.

*(మహిళా స్వయంప్రభ, అక్టోబర్ 2011 సౌజన్యంతో)*

# సాహిత్యానికి కిరీటం పెట్టిన కవులు

## ఆడిదము సూరకవి

తెలుగు సాహిత్యంతో పూర్వ పరిచయమున్నవారికి 'ఆడిదము సూరకవి' పేరు పరిచితమై ఉంటుంది. ఆయన రామలింగశతకం వ్రాశాడు. ఆయన 1720 –1785 మధ్యకాలం వాడు. విజయనగరానికి సమీపాన గల 'భూపాలరాజు రేగ' (పూసపాటి రేవ) అనే గ్రామం ఈ కవి నివాసం అని చరిత్రకారులు చెబుతారు.

సూరకవి– అసలు ఇంటిపేరు మోదుకూరి వారు. వీరి వంశీయుల్లోని ఒకరు కళింగరాజుకు సహాయంగా నిలిచి జయలక్ష్మిని వరింపజేసినందున, ఆ రాజు సంతసించి ఒక ఆడిదమును అంటే కత్తిని బహూకరించాడట. అప్పటి నుంచి మోదుకూరి వారు ఆడిదము వారైనారు. విజయనగర సంస్థానాధీశులైన పూసపాటి వారి ఆశ్రితులు.

ఈయన గ్రంథకర్తగా కంటే చాటుపద్యకర్తగా ప్రసిద్ధిగాంచాడు. రామలింగేశ శతకంలోను, రాజులలోను లోపాలను ఎత్తిచూపుతూ, హాస్యంగాను వ్యంగ్యంగాను చెప్పారు. కొన్నిచోట్ల హేళన కొంచెం కటువుగానే కనిపిస్తుంది. 'రామలింగేశ రామచంద్రపురవాస' అనే మకుటంతో రామలింగశతకం వ్రాయబడింది. ఇందులోని రామచంద్రపురం, విజయనగరం, సమీపంలో వున్న రామచంద్రపురమని పెద్దలు వాక్రుచ్చారు.

అడిదము సూరకవి రచనలోని శైలి సులభగ్రాహ్యమైనందున ఈ శతకం సామాన్య ప్రజానీకంలో చాలా ప్రచారం పొందింది. కవితా ప్రావీణ్యం ఈ శతానికి వన్నె తెచ్చిందని చెప్పవచ్చు. కొన్ని ముచ్చటించుకొందాం...

**సూర్యుడు తనశితాంశువుల బో దతిమిన,**
**కలుగవే గుహలు – చీకట్లుదాగ,**
**ఝంఝానిలము దాడి సలుప దీపమునకు**
**కలుగదే వసియింప కలశమొకటి,**
**వని సాళువంబు గువ్వను బాఅదతిమిన**
**తరుకోటరము లేదె దాని బ్రోవ,**
**గరుడుండు వెనుచన కాకోదరమునకు**
**కలుగదే వల్మీక బిలము నొకటి.**
**ప్రబలు దగువాడు దుర్బలు పాఅదఱుమ**
**దైవమొక ప్రాపు గల్పింప దలప కున్నె?**
**సొరలు గాక నహంకారమున నరుండు**
**రామలింగేశ! రామచంద్రపురవాస!**

చిమ్మ చీకట్ల వెంటబడి సూర్యుడు తన నిశిత కిరణాలతో తరిమికొడితే మాత్రం– వాటికి దాక్కొనే చోటే లేదా? ఉంది. గుహల్లో హాయిగా నిండి నిబిడీకృతమై ఉంటాయి. చిన్న దీపంపైకి పెద్దగాలి వచ్చి ఝంఝానిలంలాగా దాడిచేస్తే దానికి వేరే ఆశ్రయమే లేదా– ఉంది. ఒక్క చిన్న పాత్రలో దాన్ని ఉంచితే భద్రంగా ఉంటుంది. చిల్లుల పాత్ర ఒకటి దానిమీద బోర్లించినా చాలు గద! అమాయికమైన శాంతికాముకమైన పావురాన్ని ఒక క్రూరమైన డేగ తరుముకొంటూ వస్తే– చెట్టు తొఱ్ఱ లేదా ఏమిటి – దానికి రక్షణ కల్పించటానికి? గరుత్మంతుడు గనుక పామును పట్టుకొనేందుకు వెంటాడుతుంటే– అది దూరిపోవటానికి ఒక వల్మీక బిలం ఉండదా యేమిటి? అని ప్రశ్నించుకుని ఉంటుంది అంటారు.

కండకావరంతో నరుడు కన్నుమిన్నుగానక, సామాన్యులను బలహీనులను హింసించే ప్రయత్నం చేస్తున్నప్పుడు జగద్రక్షకుడైన భగవంతుడు ఏదో విధంగా ఆపన్నులను ఆదుకొంటాడని ఆయన భావం.

విజయనగరాన్ని ఆ రోజుల్లో పరిపాలించిన విజయరామ గజపతి యొక్క సవతియన్న రాజ్యభారం వహించినప్పుడు అతని దుశ్చర్యలకు ప్రజల చాలా బాధపడేవాడు. అప్పటి సాంఘిక పరిస్థితులకు అద్దంపడుతోంది పద్యం:

**తెరవాట్లు గొట్టి సత్తరువు బెట్టుట కంటె**
**న్యాయార్జితాన్న మింతైన చాలు**
**తోటలు నఱికిన దొడ్డ చావడి కంటె**
**ననఘమైన తగు పంచటరుగు మేలు,**
**బహుఘాతుడు పెట్టు పాయసాన్నము కంటె**
**సద్వర్తనుడు పోయు జావ మేలు,**
**అందఱ జెఱచి వెయ్యాఱు లిచ్చుట కంటె**
**కష్టార్జితం బొక్క గవ్వమేలు**
**గర్వపడుదురు తమపాట్లు గానలేక**
**ప్రభువులమటంచు దుర్న్యయోపాయరతులు,**
**వారి బొగడంగ మాకుత్సవంబు లేదు**
**రామలింగేశ! రామచంద్రపురవాస!**

దారి కాచి దోచుకొనే దొంగలై ధనమార్జించి సత్రాలు నిర్మించి గుండిగలతో వండి వార్చి అనేకులకు అన్నదానం చేసేకంటే, న్యాయంగా సంపాదించిన దాంట్లో పిడికెడన్నం ఒక్కడికి పెట్టినా చాలు. ప్రకృతి సంపదగా శోభిల్లుతూ ప్రాణాధారమైన హరితవనాన్ని సమూలంగా నఱికివేసి – బాటసారుల విశ్రాంతి కోసం విశాలమైన పెద్ద చావిడి నిర్మించే కంటే, ఇంటి ముందు పంచలో కాస్త అరుగు ఉండేటట్లు ఏర్పాటు చేస్తే చాలు. హత్యలు, మారణకాండలు నిత్యకృత్యంగా చేస్తూండేవాడు పెట్టే పాయసాన్నం కన్నా, సత్యశీలి, ధర్మవర్తనుడు, శాంతస్వభావియైన సహృదయుడు కాచిపోసే, జావ చాలు. మేలు చేస్తుంది. పదిమంది జేబులు కొట్టి పదివేలు దానం చేస్తే– దాన్ని పుచ్చుకొనడం కంటే కష్టపడి సంపాదించినవాడు, ఉన్నంతలో ఇచ్చే ఏ కాస్తంతైనా స్వీకరించడం మంచిది. అటువంటి అవినీతి పరులైన ప్రభువులు ఇంత చేశాను, అంత చేశాను అని గర్వపడితే పడతారు కానీ, కవులమైన మాకు మాత్రం అటువంటి వాళ్లను పొగడ్తలతో ముంచెత్తాలనే ఆలోచన ఉండదు అంటారు.

**నగవు మార్దవము దంతములు తోచని యున్కి**
**మనసు నొవ్వక యున్కి మాట నేర్పు**
**ఎలమి రిక్తుల దాత హింసించ కుండుట,**
**దాన సౌష్టవము పాత్రం బెఱుగుట**
**జనరంజనము చేత ధనము గూర్చెడి నేర్పు**
**మొగమాట విడుచుట తగవు నేర్పు**
**అగపడనీమి మంత్రాలోచనము నేర్పు,**
**తఱి యెఱుంగుట రిపు చెఱచు నేర్పు**
**శక్తి బొడించుకొని నేర్పు సహసముద్ర**
**హెచ్చరించుట పనులు సేయించు నేర్పు**
**మౌన మన్యుల యచ్చంపు మాట నేర్పు**
**రామలింగేశ రామచంద్రపురవాస!**

నవ్వు యొక్క అందము దంతాలు కనపడకుండా నవ్వినప్పుడే! మాట్లాడేటప్పుడు ఇతరులను నొవ్వకుండా చేస్తేనే అది నేర్పుగలవాని మంచిమాట అవుతుందిట. పేదవారిని హింసించకుండా ఉండటమే 'దాత' అనిపించుకొనే వాడికి ఉండవలసిన లక్షణం. పాత్రత కలిగినవాడికి దానం చేస్తేనే అది సరియైన దానం. ధనం కూడబెట్టుకొనటంలో తప్పేమీ లేదు. కాని అది జనరంజకమైన ధనసేకరణగా ఉండాలి. ఇద్దరి మధ్య ఏ కారణం చేతనైన తగవు ఏర్పడినప్పుడు న్యాయం చెప్పేవాడు వారియెడల వ్యక్తిగతమైన మొగమాటాన్ని విడిచిపెట్టి, సరియైన నిర్ణయం చెయ్యాలి.

ప్రధానమైన విషయాల్లో ప్రభువు మంత్రులతో ఆలోచన చేసేటప్పుడు అతి గుప్తంగా ఉంచాలి. అది ఎవరికీ తెలియనీయరాదు. శత్రువుల మీదకు దండెత్తేటప్పుడు అది సరియైన సమయం అవునా కాదా అని ముందుగా ఆలోచించాలి. నీవు చేసిన మంచి పనులు ఇతరులు మెచ్చుకోవాలని తాపత్రయపడటం మంచిదికాదు. చేసేదేదో నీకు సంతృప్తి కలిగేటట్లు మంచిపనిచేశావుగదా అని విర్రవీగకు. ఇక ఏమీ ఆశించకు. అది సరే– నీ క్రిందపనిచేసే వారి చేత వారు సక్రమమైన విధంగా పనిచేస్తున్నదీ లేనిదీ పర్యవేక్షించవలసిన బాధ్యత మాత్రం నీదే! అవసరమైతే వారిని హెచ్చరించటం కూడా నీ బాధ్యతే. ఏ విషయాన్నయినా అన్యులు నీకు నివేదిస్తున్నప్పుడు నీవు మౌనంగా ఉండి, ముందు వినాలి. ఆపైన అవసరమైతే స్పందించాలి.

250 సంవత్సరాల క్రితం వ్రాయబడిన ఈ శతకంలో అప్పటి సాంఘిక పరిస్థితులకు చక్కదిద్దేటందుకు హితబోధ చేస్తూ, నీతిమార్గం చూపిస్తూ తన ధ్వని మయాత్మకమైన కవితా సమ్మోహనాస్త్రాన్ని ప్రయోగించిన అడిదము సూరకవిని– ఇప్పుడు కూడా మనం స్మరించుకొనటం– ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో అవసరమే అనిపిస్తోంది. 'సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్'. ●

# శ్రీసూర్యనారాయణా ఆలయం...



తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లాలో కొలువైన నవగ్రహాలయాలు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి పొందాయి.న కుంభకోణం చుట్టుపక్కల 60 కి.మీ దూరంలో అక్కడక్కడా నెలవైన క్షేత్రాలు ఎన్నో.. ఆ ఆలయాలన్నింటిలోకి నవగ్రహాలకు అధిపతి అయిన సూర్యుడి కోవలె ఉన్న 'సూర్యనార్ కోవిల్' క్షేత్రం కుంభకోణం తిరుమంగళక్కుడు మధ్య రోడ్డు మార్గంలో కొలువై ఉంది. ఈ గుడిలో సూర్యుడు తన భార్యలైన ఉష, ఛాయా సమేతంగా దర్శనమిస్తాడు. సూర్యుడికి అభిముఖంగా దేవగురువు బృహస్పతి, వీరిరువురి చుట్టూ ఆలయ ప్రాకారంలో మిగతా గ్రహాలూ కొలువై ఉం టారు. ఆలయ ప్రాంగణంలో కాశీవిశ్వేశ్వరుడినీ విశాలాక్షినీ నవగ్రహాలచే ప్రతిష్ఠితమైనట్లు చెప్పే వినాయకుడినీ దర్శించవచ్చు. సూర్యుడిని తామరపూలతో అర్చించడం ఇక్కడ ఆచారం. మూడు అంతస్థులతో కళ్లుచెదిరే శిల్పకళా వైభవానికి నెలవైన ఈ ఆలయాన్ని చోళరాజైన మొదటి కులోత్తుంగ చోళుడు పదకొండో శతాబ్దంలో నిర్మించాడని చారిత్రకాధారాలను బట్టి తెలుస్తోంది.

కుంభకోణ ప్రాంతంలో.. పూర్వం కళవుడనే రుషి ఉండేవాడు. ఆయనకు భవిష్యత్తును దర్శించగలిగే శక్తి ఉండేది. ఒకసారి ఆయన తనకు కుష్ఠురోగం రాబోతుందని గ్రహించి, దాన్నుంచి తప్పించుకునేందుకు జపతపాదాలతో నవగ్రహాలనూ ప్రసన్నం చేసుకున్నాడు. తనకు ఆ రోగం రాకుండా అనుగ్రహించమని వారిని వేడుకున్నాడు. అందుకు వారు అంగీకరించడంతో కలవమహామునికి కుష్ఠురోగం ముప్పుతప్పిందట. ఈ విషయం బ్రహ్మదేవుడికి తెలియడంతో ఆయన ఆగ్రహోదరుడయ్యాడు. సృష్టి నియమాలకు విరుద్ధంగా ప్రవర్తించి తన రాతనే ధిక్కరించిన నవగ్రహాలకు కుష్ఠురోగం వస్తుందని శపించాడు. బ్రహ్మ శాపం ఫలించడంతో సూర్యచంద్రాదులు ఆ వ్యాధి బారిన పడ్డారు. అప్పుడు వారు తమకు ఆ శాపం తొలగిపోయే మార్గం చెప్పమని బ్రహ్మదేవుణ్ని వేడుకోవడంతో



తిరుమంగళక్కుడిలోని ప్రాణనాథేశ్వరుణ్ని సేవించుకోమని చెప్పాడాయన. దాంతో వారు భూలోకానికి దిగివచ్చి, ఆ ఆలయప్రాంగణంలో వినాయకుణ్ని కూడా ప్రతిష్ఠించి మంగళాంబికా సమేత ప్రాణనాథేశ్వరుడినీ గణపతినీ పూజించి శాపవిమోచనం పొందారట.

అదే సమయంలో... వారు తనపట్ల చూపిన దయకు కృతజ్ఞతగా కళవ మహాముని తిరుమంగళక్కుడి ఆలయానికి సమీపంలో నవగ్రహాలు తపమాచరించిన చోట వారికోసం ప్రత్యేకంగా ఒక గుడి నిర్మించాడు. అందులో ప్రధానమూర్తి సూర్యుడు. ఆ ఆలయమే 'సూర్యనార్ కోవిల్'గా సుప్రసిద్ధమైంది.

ఈ ఆలయంలో సూర్యుడు పడమటి దిశగా ప్రతిష్ఠితమై ఉంటాడు. ఆ దినకరుడి విగ్రహానికి అభిముఖంగా బృహస్పతి విగ్రహం ఉంటుంది. ఆలయం అంతర్భాగంలోనే కాశీవిశ్వేశ్వరుడు విశాలాక్షి సమేతంగా కొలువై ఉంటాడు. ఈ ఆలయానికి వచ్చేవారు ఒక పద్ధతి ప్రకారం నవగ్రహాలను దర్శించుకుంటే మంచిదని ప్రతీతి. ఈ సూర్యనార్ కోవిల్‌ను దర్శించుకునే ముందు తిరుమంగళక్కుడిలోని ప్రాణనాథేశ్వరుడి ఆశీస్సులు పొందాలి. అనంతరం ఇక్కడికి వచ్చి ముందుగా... వినాయకుడిని పూజించాలి. ఆ తర్వాత ఆ పక్కనే నాట్యమండపంలో కొలువైన నటరాజునూ, కాశీవిశ్వేశ్వరుణ్నీ, విశాలాక్షినీ చూసి అప్పుడు సూర్యుడినీ గురుడినీ దర్శించుకోవాలి. గురుడి విగ్రహం ప్రక్కభాగంలో ఉండే ద్వారం గుండా బయటికి వచ్చి అప్రదక్షిణంగా వెళ్తూ ఆ వరుసలో ఉండే శనైశ్చరుడినీ, బుధుణ్నీ, అంగారకుణ్నీ, చంద్రుణ్నీ, కేతువునీ, శుక్రుణ్నీ, రాహువునీ దర్శించుకుని చండీకేశ్వర దర్శనం చేసుకోవాలి. అక్కణ్నుంచి ప్రదక్షిణం చేస్తున్నట్లుగా గర్భాలయం వెనుకగా వచ్చి మళ్లీ వినాయకుణ్ని దర్శించుకోవాలి. ఇలా చేస్తేనే ఆలయదర్శన ఫలం దక్కుతుందంటారు.

గ్రహదోషాలతో బాధపడేవారు తమిళనాడులోని నవగ్రహాలయాలకు వెళ్లి ఆయా గ్రహపీడా నివారణకు పూజలు జరిపించుకుంటారు. ఆ ఆలయాలకు వెళ్లలేనివారు ఈ గుడిలో సూర్యుడి సమక్షంలో కొలువై ఉన్న ఆయా గ్రహాలకు పూజలు జరిపించినా అదే ఫలితం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

# జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

నీవెప్పుడైనా, ఏ పనినైనా చేస్తానని వాగ్దానం చేస్తే,
దానిని ఖచ్చితంగా నియమిత సమయానికే నిర్వర్తించాలి.

- స్వామి వివేకానంద



## పరుగు పార్రంభం

భగవంతుని దయ మీ అందరి శుభాసీస్సులతో పరుగు ప్రారంభించా. డిశెంబర్ 2, 2015 దెబ్బనుండి బయటపడడానికి ఇన్నిరోజులయ్యింది .గత నెల్లాళ్ళుగా ఎంత ప్రయత్నించినా లేటుగానే పనులవుతున్నాయి. ఈరోజుతో అన్ని పనులూ అయ్యాయి. కాని నా పరుగు అంత సులువుగా సాగలేదు, చాల అడ్డంకులు, అవరోధాలు, నిరాశ, నిట్టూర్పు, వెటకారం, వేళాకోళం, అన్ని మసాలాలు కలిసాయి.

ఈమధ్య సన్నాఫ్ సత్యమూర్తి, నాన్నకు ప్రేమతో సినిమాలలోలా అంత ఈజీగా కోట్ల అప్పులు తీరేలా జరగలేదు. సినిమా ఓ అందమైన అనుభవం.

మొదటగా బ్యాంక్, మనలాంటి వారికెందుకిస్తారు, విజయ్ మాల్యాలకిస్తారుగాని, సుమారు నెల తిరిగా, ఏవేవో పేపర్లడిగారు, అన్నీ నీళ్ళపాలన్నా, మీకు నన్ను పాతికేళ్ళగా తెలుసన్నా, నవ్వుకున్నారు, ఇక లాభం లేదని దెబ్బలాడా, ఎందుకివ్వరని నిలదీసా, ఇన్ని సంవత్సరాల నా అకౌంట్ క్లీన్ అన్నా, దారికొచ్చారు, అంతివ్వం అన్నారు, ఏదోలా వారి దగ్గిర వూ అనిపించుకుని, ఇచ్చింది తీసుకుని మెల్లి మెల్లిగా అన్నీ అమర్చుకున్నా.

ముందుగా ప్రెస్ ఎత్తు పెంచా, టైల్స్, డోర్స్, పెయింటింగ్, మెషినరి రెపేరు, రెండు కొత్త మెషిన్లు అమర్చా. ఇవన్నీ నత్త నడక, మెల్లిగా నాలుగు నెలలయ్యింది. పైగా అన్నది రూపాయి, బిల్లు రెండు రూపాయల, అనుకున్న దానికన్నా రెండింతలు ఖర్చు. పైకి నవ్వుతూ వున్నా "అది నా సహజ గుణం" ఏదో తెలియని వెలితి, అయినా ధైర్యాన్ని వదలలేదు. సరే ఈరోజు మెల్లిగా ప్రారంభించా, ఈ రోజు అమ్మ ఆబ్దికం, ఆవిడ దీవెనలతో ప్రారంభించాలని వుందేమో (25-4-2016).

ఇక పోరాటం అంటారా, తల్లి గర్భం నుంచి అది మొదలవుతుంది, బయటకు రావడానికి జీవన్మరణ పోరాటం. ఎదుగుదలలో పోరాటం. వెల్లకిలా పడుకున్న మనం బోర్లా పడడానికి తెగ ప్రయత్నిస్తాం, అదే బోర్లా పడ్డాక బొబ్బట్లు చేసుకుని సంబరపడతారు, అదే పెద్దయ్యాక బోర్లా పడితే లోలోపలే సంతోషిస్తారు, చూసారా ఎదుగుదలలో ఎంత మార్పో, చిన్న వయసులో నడక నేర్చుకునేటప్పుడు అనేకసార్లు కింద పడతాం అప్పుడందరికి సరదా, మనం మళ్ళీ లేచి నిలబడితే అదో ఆనందం, కాని పెద్దయ్యాక మనం పడితే ఇదో ఆనందం - ఇలాంటి మనుషులతో నవ్వుతూ మెలగుతూ మన సత్తా చూపించాలి, ఈ రోజే నా స్నేహితుడు ఒక మంచి కొటేషన్ పంపాడు

Life is similar to a boxing game
defeat is not declared , when you fall down
it is declared , when you refuse to get up
don"t give up
నిజమేగా నేనింకా బాక్సింగ్ రింగులోనే వున్నా
లేచా నిలబడ్డా
పోరాటం ప్రారంభించా
నెగ్గుతా.
నాకా నమ్మకం దేవుడిచ్చాడు.

ఎందుకంటే కింద పడ్డ నాకు లేచి నిలబడగలిగిన శక్తినిచ్చిన దేవుడు, గెలిపించే శక్తిని ఆయనే ఇస్తాడు.

నాకిలా జరిగిందని డిసెంబర్‌లో నేను పత్రికలో రాసినప్పుడు చాలామంది నాకు సానుభూతి, ధైర్యం, శుభాస్సీస్సులు అందజేసారు, అందరికి నా కృతజ్ఞతలు.

ఇక్కడ ప్రత్యేకంగా ఒకాయన గురించి చెప్పాలి ఆయనే కిషోర్ అమెరికాలో వుంటున్నారు. నాకు ఆయనకి పెద్ద పరిచయం లేదు, ఒకసారి సాయి భజనలోను, మరోసారి బాబా గుడి విషయంగాను కలుసుకున్నా, ఆ పరిచయంతో ఆయన పెళ్ళికి నన్ను పిలిచారు, అంతే మూడుసార్లు కలుసుకున్నాం, కాని నా FB పోస్ట్ చూసి నేను ఊహించని మొత్తాన్ని మీ అకౌంట్ నంబర్ చెప్పండి, నేను డబ్బు పంపిస్తా అన్నారు, "పెద్ద మొత్తం" లేదండి అవసరమనుకున్నప్పుడు నేనే అడుగుతా అన్నాను, చూసారా దేవుడెలా ఆదుకుంటాడో, పెద్దగా పరిచయం లేకపోయినా నాపై నమ్మకంతో ఆయనా ఆఫర్ ఇచ్చారు, ఆయన నాపై ఉంచిన నమ్మకానికి ఆయనకు నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను, పైగా నేను తీసుకోలేదని నొచ్చుకున్నారు. దైవం మానుష రూపేణ అంటే ఇదేగా.

నన్నింత చేసి ఆదరించిన చెన్నై
మొత్తం సినీ పరిశ్రమ అంతా వెళ్ళిపోయినా
దిక్కుతోచని మాకు తానే దిక్కైన చెన్నై
తన బిడ్డను పైకి లేపి నిలబెడుతుంది
తనతోనే విశ్వాసంగా ఉండిపోయానని అభిమానంతో ఆదరిస్తుంది.
ఇక పరుగు ప్రారంభించా
గెలుపు పోరాటం ఆరంభించా.

* * *

## కప్ప కథ - మీకు తెలిసినదే
## కాని ఫినిషింగ్ టచ్ వేరే ఇచ్చా



ఓ కప్పను గిన్నెలో వేసి దానిలో నీళ్ళు పోసి ఆ గిన్నెను వేడి చెయ్యండి.

ఆ నీళ్ళు కాస్త కాస్త వేడెక్కను ఆ నీటి ఉష్ణానికి తగ్గట్టు కప్ప తన శరీరాన్ని అడ్జస్ట్ చేసుకుంటుంది , నీళ్ళు బాగా వేడెక్కాక అది బయటకు దూకాలని ప్రయత్నించి కుదరక చచ్చిపోతుంది.

బాగా ఆలోచించండి , ఆ కప్ప ఎందుకు చచ్చిపోయిందో , నాకు తెలుసు మీరందరూ బాగా మరిగిన నీళ్ళ వల్ల అంటారు.

కాని ఆలోచిస్తే మీకే తెలుస్తుంది

ఆ కప్పయొక్క అలసత్వం చేతకానితనం వల్ల అది చచ్చిపోయింది. నీళ్ళు కొంత వేడెక్కాక అది ప్రయత్నించి వుంటే బయట పడేది , ప్రాణం దక్కేది .

మనమందరం కూడా జీవితంలో కొన్ని సమస్యలకు ఎలా స్పందించాలో తెలుసుకోవాలి , మనల్ని సమస్యలు చుట్టుముట్టినప్పుడు అవి విశ్వరూపం దాల్చక ముందే వాటి నుండి ఎలా బయటకు రావాలో ఆలోచించాలి , జాప్యం చేశామా , గిన్నెలో కప్ప గతే మనదీను. సమస్యలు నుండి బయటపడడం తక్షణ కర్తవ్యంగా వుండాలేగాని ఆలోచిస్తూ కూర్చుంటే అందులోనే మసైపోతాం. వొంటిలో శక్తి వున్నప్పుడే బయటపడడం గురించి ఆలోచించండి శక్తి ఉడిగాక ఏమి లాభం లేదు , అదే చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ప్రయోజనం లేదుగా.

కథలోని నీతిని చూడండి

అంతేగాని ఆ గిన్నె కప్ప ఎక్కడనుండి ఫొటో తీసానో ఆలోచించకండి. ●





# GOTETI GRAPHICS

FOR COMPLETE PRINTING SOLUTIONS

- Offset printing
- Desk top publishing
- Prepress
- Postpress

Office : #64 (#16), Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. INDIA. ☎ 91-44-2474 2091
Telefax : 91-44-23716322 e-mail : gotetigraphics@gmail.com

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
May 2016

REGN. No. TN/CC(S)DN/177/15-17
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97

